www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి

TELANGANA RISING
CURE - PURE - RARE



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:16 MONDAY ,MAY 25,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 16 సోమవారం 25 మే 2026 పేజీలు :8 వెల: 4/-

## భారత్‌ను తగులబెట్టేందుకు ఇండియా కూటమి కుట్ర.. పీయూష్ గోయల్

మే 24 ( హంసకలం వార్త )

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, విపక్ష పార్టీల పై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఆదివారం నాడు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశాన్ని అస్థిరపరచేందుకు వీరంతా కుట్రపన్నుతున్నారని, హింసను రెచ్చగొడుతున్నారని అన్నారు. పాలకపక్షాన్ని ఎన్నికల ప్రక్రియ ద్వారా ఎదుర్కోవడంలో విఫలం కావడంతో ఉద్దేశపూర్వకంగా దేశంలో - మిగతా2లో



## అసలైన బిన్ లాడెన్ నేనే.. వైట్‌హౌస్ కాల్పుల ఘటన నిందితుడి పోస్టు

మే 24 ( హంసకలం వార్త )

అమెరికా అధ్యక్ష భవనం శ్వేత సౌధం వద్ద ఆదివారం కాల్పులకు తెగబడ్డ నిందితుడు నసీర్ బెస్ట్ అధ్యక్షుడు ట్రంప్‌ను టార్గెట్ చేస్తూ ఆన్‌లైన్‌లో పలు పోస్టులు పెట్టినట్టు అధికారులు గుర్తించారు. అధ్యక్షుడికి హాని తలపెడతానంటూ అతడు ఈ పోస్టులను పెట్టినట్టు దర్యాప్తు లో తాజాగా వెలుగులోకి వచ్చింది. - మిగతా2లో



# జూన్ 2 నుంచి ‘ఇందిరమ్మ భీమా’

# పేదరికం పై కాంగ్రెస్ సమరం



- రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల భీమా రక్షణ
- మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు
- సన్న బియ్యం,ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లతో ప్రజా సంక్షేమమే లక్ష్యం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

మే 24 ( హంసకలం వార్త )

తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ, నిరుపేదల ముంగిటకే సంక్షేమ ఫలాలను చేరవేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టంగా ప్రకటించారు.రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కానుకగా జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా చారిత్రాత్మక ‘ఇందిరమ్మ భీమా’ పథకాన్ని ప్రారంభించబోతున్నట్లు ఆయన ప్రకటించారు. కులమతాలకు అతీతంగా,పేద ధనిక భేదం లేకుండా రాష్ట్రంలోని కోటీ 15 లక్షల కుటుంబాలకు ఈ భీమా రక్షణ కవచంలా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. - మిగతా2లో

## జొన్న, మొక్కజొన్న రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన తెలంగాణ ప్రభుత్వం



మే 24 ( హంసకలం వార్త )

తెలంగాణలోని అన్నదాతలకు రేవంత్‌రెడ్డి సర్కార్ తీపి కబురు అందించింది. రాష్ట్రంలో జొన్న, మొక్కజొన్న పంటల కొనుగోళ్లకు భారీగా నిధులను కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వివరాలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మొక్కజొన్న కొనుగోలుకు రూ.1,800 కోట్లు, జొన్న కొనుగోలుకు రూ.1,100 కోట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. మొక్కజొన్న సేకరించాలని తాము కోరినప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని, అందుకే రైతులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా - మిగతా2లో

## కేసీఆర్ మోసం చేశాడు.. మేం న్యాయం చేస్తాం



- పాలమూరు ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తి చేస్తాం
- ఎమ్మెల్యే శంకర్ కృషితోనే లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ కు నిధులు
- భూసేకరణ వెంటనే మొదలవుతుంది
- గత ప్రభుత్వం పూర్తిగా ద్రోహం చేసింది

## సంక్షోభంలోనూ ఇంధన ధరల నియంత్రణ మోదీ ప్రభుత్వ ఘనతే..

మే 24 ( హంసకలం వార్త )

అంతర్జాతీయంగా చమురు సంక్షోభం వెంటాడుతున్నా దేశంలో ఇంధన ధరలను అదుపులో ఉంచిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్‌దేనని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. తెలంగాణను వంతులవారీగా కొల్లగొడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండు ఒకటేనని, కాళేశ్వరం సీబీఐ విచారణ పేరుతో ఈ రెండు పార్టీలు చీకటి ఒప్పందాలకు తెరలేపాయని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఖమ్మంలో బిజెపి - మిగతా2లో



## తెలంగాణలో మారుతున్న వాతావరణం మూడు రోజుల పాటు వర్షాలు, ఈదురు గాలులు

మే 24 ( హంసకలం వార్త )

తెలంగాణ రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు క్రమంగా మారుతున్నాయి. ఒకవైపు ఎండలు కొనసాగుతుండగా మరోవైపు నైరుతి రుతుపవనాలు చురుకుగా ముందుకు సాగుతున్నాయి.దీంతో రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వర్షాలు, ఉరుములు, ఈదురు గాలులు నమోదయ్యే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. - మిగతా2లో



## ప్రొఫెసర్ నాగేశ్వర్ పై కేసులు తక్షణమే ఎత్తివేయండి: ఏపీ ప్రభుత్వానికి హరీశ్ రావు విజ్ఞప్తి

మే 24 ( హంసకలం వార్త )

జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వంపై ప్రముఖ రాజనీతి విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర రాజకీయ దుమారం రేపిన సంగతి తెలిసిందే. వైసీపీ అధినేత జగన్‌ను అరెస్ట్ చేయాలంటూ పవన్ కల్యాణ్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరినట్టు జగన్ - మిగతా2లో



## జొన్న, మొక్కజొన్న రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన తెలంగాణ ప్రభుత్వం

-మొదటిపేజీ తరువాయి

ముందుకొచ్చిందని మంత్రి స్పష్టం చేశారు. భారీ దిగుబడుల నేపథ్యంలో రైతులను కాపాడాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని తుమ్మల పేర్కొన్నారు. మొక్కజొన్న సేకరణకు ఇదివరకే రూ.4,000 కోట్లు విడుదల చేయగా, తాజా కేటాయింపులతో కలిపి ఆ మొత్తం రూ.5,800 కోట్లకు చేరిందన్నారు. జిల్లాల వారీగా ఈ పంటల సేకరణకు తక్షణమే ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దీనితో పాటు పొద్దుతిరుగుడు రైతులను కూడా ఆదుకుంటామని, 25 శాతానికి మించి ఆ పంటను కొనుగోలు చేయాలని సీఎం ఆదేశించారని తెలిపారు.

## అసలైన బిన్ లాడెన్ నేనే.. వైట్‌హౌస్ కాల్పుల ఘటన నిందితుడి పోస్టు

-మొదటిపేజీ తరువాయి

తానే అసలైన బిన్ లాడెన్ అని కొన్ని పోస్టుల్లో నిందితుడు పేర్కొన్నాడు. నిందితుడి అనుమానాస్పద వైఖరి సీక్రెట్ సర్వీసు ఏజెంట్స్ దృష్టికి వచ్చినప్పటికీ అతడు హింసకు దిగవచ్చన్న ఆధారాలు మాత్రం అప్పట్లో లభించలేదని సమాచారం. ఒక సందర్భంలో అధికారులకు చిక్కిన అతడు తాను క్రీస్తు అవతారాన్ని అని కూడా చెప్పుకున్నట్టు తెలిసింది. అతడికి మానసిక ఆరోగ్య సమస్యలు ఉన్నట్టు తెలిసింది. గతేడాది జూన్‌లో నిందితుడు వైట్‌హౌస్‌కు వెళ్లే ఒక మార్గాన్ని బ్లాక్ చేసేందుకు ప్రయత్నించ గా అధికారులు అతడిని సైకియాట్రీ ఆసుపత్రికి తరలించాల్సి వచ్చింది. ఆ తరువాతి నెలలోనే అతడు వైట్‌హౌస్ కాంప్లెక్స్ డ్రైవ్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించి మళ్లీ అధికారులకు దొరికిపోయాడు. ఇక తాజా ఘటనలో బెస్ట్ శ్వేతసౌధం సమీపంలోని ఒక చెకింగ్ పాయింట్ వద్ద తన బ్యాగులోని గన్నును తీసి కాల్పులకు దిగిన విషయం తెలిసిందే. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది అతడిని మట్టుపెట్టారు. ఘటన సమయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శ్వేతసౌధంలోనే ఉన్నారు. దీంతో, అక్కడి భద్రతపై ఆందోళన పెరిగింది.

## భారత్‌ను తగులబెట్టేందుకు ఇండియా కూటమి కుట్ర.. పీయూష్ గోయల్

-మొదటిపేజీ తరువాయి

అశాంతి సృష్టించేందుకు కుట్ర పన్నుతున్నారని సామాజిక మాధ్యమం ‘ఎక్స్’లో ఆయన ఆరోపించారు. ‘దేశాన్ని అస్థిరపరచేందుకు కాంగ్రెస్, విపక్ష పార్టీలు కుట్ర పన్నుతున్నాయి. దేశాన్ని అస్థిర పరచాలని ఈ టూల్‌కిట్ గ్యాంగ్ కలలు కంటోంది. రాహుల్ గాంధీ ప్రకటన ఆషామాషీగా చేసినది కాదు. దేశంలో అరాచకం వ్యాప్తి చేసేందుకు జరుగుతున్న కుట్రలో భాగం. రాజకీయ నిరాశానిస్పృహలే ఇందుకు కారణం. డైనమిక్ ప్రధాని నరేంద్ర మోదీని ప్రజల గుండెల్లోంచి వేరుచేయలేమని, ప్రత్యక్ష ప్రజాస్వామ్య పోరులో ఓడించలేమని రాహుల్ గాంధీ అండ్ కంపెనీకి బాగా తెలుసు. దీంతో ఇప్పుడు దేశంలో హింసను రెచ్చగొట్టాలని కోరుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ విదేశాల్లో దేశ సార్వభౌమాధికారాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపరుస్తోంది. భారత్‌పై గతంలో ఎన్నడూ లేనంత విద్వేషాన్ని వాళ్లు పెంచుకున్నారు. దేశ అంతర్గత వ్యవహారాల్లో విదేశీ శక్తుల జోక్యాన్ని కోరుతూ విదేశాలకు వెళ్తున్నారు. కాంగ్రెస్ నిజమైన ఉద్దేశం ఏమిటో రాహుల్ మాటలే చెబుతున్నాయి’ అని గోయల్ ఆరోపించారు. దేశ ప్రజల రాజకీయ స్పృహపై తమకు పూర్తి విశ్వాసముం దని, ఇండియా కూటమి పన్నాగాలను మరోసారి ప్రజలు తిప్పికొట్టాలని పీయూష్ గోయల్ కోరారు. ఈ దేశ ప్రజలు తెలివైన వారని, రాహుల్ గాంధీ, విపక్షాలు, టూల్‌కిట్ గ్యాంగ్ దేశానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న విషయం వారికి బాగా తెలుసునని అన్నారు. ఇండియాను తగులబట్టాయని కలలుగంటున్న ఇండియా కూటమి కుట్రలను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరని అన్నారు.

## ప్రొఫెసర్ నాగేశ్వర్ పై కేసులు తక్షణమే ఎత్తివేయండి: ఏపీ ప్రభుత్వానికి హరీశ్ రావు విజ్ఞప్తి

-మొదటిపేజీ తరువాయి

పవన్ కు అమిత్ షా చెప్పినట్టు ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన కామెంట్స్‌ను జనసేన పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. ఆయన వైసీపీకి తొత్తుగా మారి అవాస్తవాలు మాట్లాడుతున్నారంటూ సోషల్ మీడియాలో జనసైనికులు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించడమే కాకుండా, ఏపీలోని పలు పోలీస్ స్టేషన్లలో ఆయనపై ఫిర్యాదులు చేయడంతో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో, తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్న ప్రొఫెసర్ నాగేశ్వర్, తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు బేషరతుగా ప్రకటించారు. అయినప్పటికీ ఆయనపై నమోదైన కేసులను ఏపీ పోలీసులు ఇంకా కొనసాగిస్తుండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై తాజాగా తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు స్పందించారు. ఎక్స్ వేదికగా ఆయన ఏపీ ప్రభుత్వ తీరును తప్పుబడుతూ ఒక పోస్ట్ చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిన తర్వాత కూడా, కక్షపూరిత ధోరణితో ఆయనపై కేసులు నమోదు చేసి వేధించడం ఎంతమాత్రం సరికాదని హరీశ్‌రావు హితవు పలికారు. భావప్రకటనా స్వేచ్ఛను గౌరవించాలని, ప్రొఫెసర్‌పై పెట్టిన అన్ని కేసులను ఏపీ ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హరీశ్ రావు చేసిన ఈ ట్వీట్‌పై ఏపీ ప్రభుత్వం, జనసేన శ్రేణులు ఎలా స్పందిస్తాయో వేచి చూడాలి.

# జూన్ 2 నుంచి ‘ఇందిరమ్మ భీమా’

-మొదటిపేజీ తరువాయి

గత ప్రభుత్వ హయాంలో ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలు కనీసం లక్ష రూపాయల సాయం కోసం చెప్పులరిగేలా తిరిగినా ఫలితం లేకపోయిందని భట్టి విమర్శించారు. అటువంటి దుస్థితి పునరావృతం కాకూడదనే ఉద్దేశంతోనే, ప్రమాదవశాత్తు కుటుంబ యజమానిని కోల్పోయిన ప్రతి ఇంటికీ రూ.5 లక్షల భీమా వర్తింపజేయాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. దీనికి సంబంధించి అధికారులు త్వరలోనే ప్రతి ఇంటికీ వచ్చి వివరాలు సేకరిస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు.

### వ్యాపార వేత్తలుగా మహిళలు- లక్ష కోట్లకు వడ్డీలేని రుణాలు

మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.అందులో భాగంగా మే 27వ మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం మండలం రాజుపాలెం గ్రామంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు సోలార్ పవర్ ప్లాంట్లు కేటాయించే పథకాన్ని ప్రారంభించనున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు.మహిళా సంఘాలకు ఏటా రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. అవసరమైతే దీనిని రూ.లక్ష కోట్లకు పెంచుతామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు.ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారని తెలిపారు. త్వరలోనే మహిళా వ్యాపారవేత్తల కోసం ప్రత్యేకంగా 550 ఆర్టీసీ బస్సులను కేటాయించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

### గ్రామాల్లో ‘సన్నబియ్యం’ పండుగ

మార్కెట్లో కిలో రూ.50-55 పలుకుతున్న మేలు రకం సన్న బియ్యాన్ని రాష్ట్రంలోని కోటి 6 లక్షల కుటుంబాలకు ఉచితంగా అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని సగర్వంగా ఉప ముఖ్యమంత్రి ప్రకటించారు.ప్రతి మనిషికి 6 కేజీల చొప్పున నేరుగా పేదల ఇళ్లకే సన్న బియ్యాన్ని పంపిస్తామని చెప్పారు.

### గృహజ్యోతితో 53 లక్షల కుటుంబాలకు లబ్ది

రాష్ట్ర వ్యాప్తంగా గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తుండటం వల్ల రాష్ట్రంలోని 53 లక్షల కుటుంబాలకు కరెంటు బిల్లుల భారం తప్పిందని అన్నారు.అనేక గ్రామాల్లో 95 శాతం ప్రజలు ‘జీరో’ బిల్లులు పొందుతున్నారని ఆయన వివరించారు.

### సొంతింటి కల సాకారం

గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను వంచించిందని భట్టి ఆరోపించారు.తమ ప్రభుత్వం ప్రతి పేదవానికి ఇల్లు నిర్మించుకోవడానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందజేస్తోందన్నారు.ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. నిన్నటి క్యాబినెట్ సమావేశంలో మరో 2 లక్షల ఇళ్లను అదనంగా మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు. గుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణను నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్య లక్ష్యమని అని చెప్పారు.ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాక కార్యకర్తలే దగ్గరుండి గృహప్రవేశాలు చేయించాలని సూచించారు.

# కేసీఆర్ మోసం చేశాడు..మేం న్యాయం చేస్తాం

-మొదటిపేజీ తరువాయి

పాలమూరు ప్రాజెక్టు పేరు చెప్పి రెండుసార్లు ఘనవిజయం సాధించి తరువాత మాట తప్పి కేసీఆర్ పాలమూరు ప్రజలకు ద్రోహం చేశాడు.కానీ,పాలమూరు బిడ్డగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరుకు న్యాయం చేస్తాడు.పాలమూరు ప్రాజెక్టును వెంటనే పూర్తి చేస్తాం,లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ కలను సాకారం చేస్తాం అని రాష్ట్ర క్రీడలు,పాడి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ను పూర్తి చేయకపోతే ఏ నాయకుడైనా జీవితంలో ఏదో ఒకటి కోల్పోయినట్లే అని స్పష్టం చేశారు.కెసిఆర్ కు అడ్రస్ లేకపోయినా పాలమూరు జిల్లాలో ప్రాజెక్టు పూర్తి చేస్తాడని నమ్మి గెలిపించారని,కానీ,కేవలం తమ అవినీతి కోసం ఈ ప్రాజెక్టును వాడుతున్నారని ఆరోపించారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి 21 స్టేజీలు నీళ్లు దిగుమతి చేసుకుంటామంటూ కేవలం 18 స్టేజీలకు పరిమితం చేశారని,58 వేల కోట్లు మంజూరు అయితే కేవలం 28 వేల కోట్లు మాత్రమే ఈ ప్రాజెక్టు కోసం ఖర్చు చేశారని విమర్శించారు.ప్రజా సంక్షేమం విషయంలో ఎవరు తప్పు చేసినా ప్రశ్నించాల్సిన బాధ్యత ప్రజలపై ఉంటుందని,చివరికి తాము తప్పు చేసిన ప్రశ్నించాలని గుర్తు చేశారు. పాలమూరు ప్రాజెక్టు విషయంలో శంకర్ తో కలిసి సీఎంను కలవడం, మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డిని కలవడం,అనుకున్నది సాధించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు.బోర్లు వేసిన చుక్క నీరు రాని స్థితిలో ఉన్న పాలమూరుకు ప్రాజెక్టు అవసరం ఎంతగానో ఉందని అన్నారు.ప్రస్తుతం రంగారెడ్డి,మహబూబ్ నగర్ జిల్లాలలో కలెక్టరేట్లలో సమావేశాల అనంతరం చర్చించి ప్రాజెక్టు విషయంలో ముందడుగు వేస్తామని స్పష్టం చేశారు.భూసేకరణ నిర్వహించి పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేస్తామని అన్నారు. ఈ విషయంలో వీర్లపల్లి శంకర్ పట్టుదలతో ఉన్నాడని,సీఎం కూడా దీనిని వదిలిపెట్టడని ఆయన స్పష్టం చేశారు.పర్యావరణ అనుమతి లేకుండా,భూసేకరణ లేకుండా ఇష్టారాజ్యంగా పనులు చేపట్టి నిధులు దుర్వినియోగం చేశారని గత ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. కాళేశ్వరం కోట్లు ఖర్చుపెట్టిన గత ప్రభుత్వం పాలమూరును ఎందుకు విస్మరించిందో యువత ప్రశ్నించి తెలుసుకోవాలని పిలుపునిచ్చారు.

# తెలంగాణలో మారుతున్న వాతావరణం

-మొదటిపేజీ తరువాయి

వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం..నైరుతి రుతుపవనాలు ఆగ్నేయ అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు, కొమరిన్ ప్రాంతం,నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతం,అండమాన్ సముద్రంలోని మిగిలిన ప్రాంతాలు, తూర్పు-మధ్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాల వైపు మరింత ముందుకు సాగే పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి.ఇక మరోవైపు దక్షిణ బీహార్ పరిసర ప్రాంతాల నుంచి జార్ఖండ్,ఒడిశా మీదుగా ఉత్తర కోస్తా ఆంధ్ర తీరం వరకు ఉత్తర-దక్షిణ ద్రోణి కొనసాగుతోంది.ఇది సగటు సముద్ర మట్టానికి సుమారు 1.5 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అధికారులు తెలిపారు.ఈ ప్రభావంతో తెలంగాణలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు.

### మూడు రోజుల వాతావరణ సూచన

ఆదివారం,సోమవారం,మంగళవారం రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.ముఖ్యంగా సాయంత్రం మరియు రాత్రి వేళల్లో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపింది. అదే సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.వర్షాల ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో తాత్కాలికంగా ఉష్ణోగ్రతలు తగ్గినా.. రాష్ట్రవ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు మాత్రం ఇంచుమించు ప్రస్తుత స్థాయిలోనే కొనసాగే అవకాశముందని పేర్కొంది.

### కొన్ని జిల్లాలకు వడగాల్పుల హెచ్చరిక

వర్షాల సూచనలు ఉన్నప్పటికీ.. రాష్ట్రంలోని కొన్ని ఉత్తర,తూర్పు జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# సంక్షోభంలోనూ ఇంధన ధరల నియంత్రణ మోదీ ప్రభుత్వ ఘనతే..

-మొదటిపేజీ తరువాయి

మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రం తెలంగాణకు రూ.10 లక్షల కోట్ల నిధులిచ్చినా కాంగ్రెస్ అబద్ధాలు ప్రచారం చేస్తోందని, రైతాంగ సంక్షోభాన్ని పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఇరాన్-అమెరికా ఉద్రిక్తతలు, పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కారణంగా ప్రపంచ చమురు మార్కెట్ తీవ్ర ఒత్తిడికి గురైందని ఆయన పేర్కొన్నారు. భారతదేశ అవసరాలకు కేవలం 10 శాతం మాత్రమే సొంతంగా క్రూడ్ ఆయిల్ లభిస్తోందని, మిగిలిన 90 శాతానికి ఇతర దేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉందని వివరించారు. అంతర్జాతీయంగా ధరలు భారీగా పెరిగినప్పటికీ, యూరప్ దేశాల్లో 15 నుండి 26 శాతం, ఐర్లాండ్‌లో 28 శాతం, చివరికి పాకిస్థాన్‌లో 54 శాతం వరకు ఇంధన ధరలు పెరిగినా, భారత్‌లో మాత్రం కేవలం రూ.3 మేరకే పెంపు జరిగిందని గుర్తుచేశారు. ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముందుచూపునకు, వ్యూహాత్మక ఇంధన భద్రతకు నిదర్శనమని కొనియాడారు. అయితే దేశంలో స్వల్పంగా ధరలు పెరగడాన్ని సాకుగా చూపుతూ కాంగ్రెస్, ఇండీ కూటమి, బీఆర్ఎస్ పార్టీలు బాధ్యతారహితంగా రాజకీయ లాభాల కోసం ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని మండిపారు. గత యూపీఏ ప్రభుత్వం ఆయిల్ బాండ్ల పేరిట చేసిన లక్షల కోట్ల అప్పుల భారాన్ని భవిష్యత్తు తరాలపై నెట్టివేసిందని, ఆ ఆర్థిక దుర్వినియోగాన్ని దేశం ఇప్పటికీ భరిస్తోందని ఆరోపించారు.తెలంగాణ రాజకీయాలపై విరుచుకుపడుతూ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, గత పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒకటేనని, ఇవి సమాజాన్ని వంతులవారీగా కొల్లగొడుతున్న దొంగల ముఠాలుగా మారాయని రామచంద్రరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ రాష్ట్రాన్ని నిలువునా దోచుకుంటే, ఈ రెండు సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ పార్టీ ఆ లోటును భర్తీ చేస్తూ ప్రజాధనాన్ని ఇష్టారాజ్యంగా కొల్లగొడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరిగిన అతిపెద్ద అవినీతి కుంభకోణమైన కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతున్న సీబీఐ నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. పూర్తి స్థాయి విచారణ జరపకుండా, కేవలం కొన్ని చిన్నపాటి సాంకేతిక విషయాలను మాత్రమే సీబీఐకి అప్పగించి అసలు దోషులను, బీఆర్ఎస్ పెద్దలను రక్షించే ప్రయత్నం చేస్తోందని, కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ మధ్య ఉన్న చీకటి ఒప్పందాలకు ఈ తూతూమంత్రపు విచారణే నిదర్శనమని కుండబద్దలు కొట్టారు. రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్న కాంగ్రెస్ పాలకులకు ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారన్నారు.విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు సుమారు రూ.10 వేల కోట్లకు పైగా పేరుకుపోయాయని, పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో బీజేపీ పాత్ర కీలకమైనదని, దివంగత సుష్మాస్వరాజ్ పార్లమెంటులో బిల్లుకు మద్దతు ఇవ్వకపోతే తెలంగాణ సాధ్యమయ్యేదా అని ప్రశ్నించారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని వ్యవసాయ రంగం, రైతాంగం ఎదుర్కొంటున్న ప్రస్తుత సంక్షోభంపై ఆయన అత్యంత ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలు సకాలంలో తెరవకపోవడం వల్ల వరి, మొక్కజొన్న పండించిన అన్నదాతలు ఐకేపీ కేంద్రాల వద్ద వారాల తరబడి కన్నీరు పెడుతూ పడిగాపులు కాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.తాలు పేరుతో క్వింటాళ్లకు కిలోల కొద్దీ అక్రమ తరుగు తీస్తూ దోచుకుంటున్నా పాలకులు కంటినిండా నిద్రపోతు న్నారని విమర్శించారు. దళారుల చేతుల్లో మొక్కజొన్న రైతులు విలవిలలాడు తున్నా ప్రభుత్వం జోక్యం చేసుకోవడం లేదని, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణను గాలికొదిలేయడం వల్లే ఆయిల్ పామ్, వరి, పత్తి పంటలు ఎండిపోతున్నాయని ఆరోపించారు.

# సంపాదకీయం

## మతాలన్నీ సనాతనం వైపే!

సమాజంలో సామరస్యం సాధించాలంటే మతాల మధ్య కృత్రిమమైన అగాధాలను పూడ్చుకోవడం అవసరం. ఈ ఆలోచనలో భాగంగా ఈ రచయిత ఇక్కడ ఒక ప్రతిపాదన చేయదలు చుకున్నాడు. ప్రతి పాదనే సుమా! భాషలో రెండు ధోరణులు వున్నాయి. కొన్ని పదాలు తమ అసలైన అర్థంతోనే చెలామణిలో వుంటాయి. వీటిని 'ధాత్వర్థం' అనవచ్చు. మరికొన్ని పదాలు అసలైన అర్థాన్ని విడిచి మరో అర్థంలో చెలామణిలో వుంటాయి. వీటిని 'రూఢ్యర్థం' అనవచ్చు. ఉదాహరణకు 'అన్నం' అనే పదానికి 'తినుట' అనేది ధాత్వర్థం. కానీ ఈ అర్థం వాడుకలో లేదు. బియ్యమును వండివార్చినదే అన్నము అన్నది రూఢ్యర్థం. మతపారిభాషిక పదాలను గుర్తిస్తే చాలా పదాలు వాడుకలో అర్థభ్రంశమైనవి. అనగా వాటి అసలు అర్థం కోల్పోయి అపభ్రంశమైన అర్థాలతో చెలామణి అయ్యేవి. 'సనాతన ధర్మం' అనే పదం అట్లాంటిదే. సనాతన ధర్మానికి వున్న అసలైన అర్థం నుండి భారతీయులు చాలా దూరం వచ్చేసినారు. ఒక రాజకీయ పార్టీ సనాతన ధర్మాన్ని హైజాక్ చేసింది. వర్ణాశ్రమ ధర్మాలు ఆపాదించి, బ్రాహ్మణులు దానిని మతపరం చేసినారు. తమిళనాడులో డీఎంకే వంటి పార్టీలు సనాతన ధర్మాన్ని కులపరం చేసినాయి. ఒకసారి సనాతన ధర్మానికి ఏర్పడిన పెడర్థాలు పక్కకుపెట్టి పరిశీలన చేద్దాం. 'సనా' అంటే సృష్టికి పూర్వం వున్నది అని అర్థం. ధర్మం అంటే దానిని చేరుకునే మార్గం. సనాతన ధర్మం అంటే-- 'ఎప్పటినుండో వుంటూ, వర్తమానంలో కొనసాగుతూ, భవిష్యత్తులో కూడా కొనసాగేది' అని అర్థం. అనగా, ఈ ప్రపంచంలో 'నేను' అనే అస్తిత్వం ఒకటి ఏర్పడక ముందు, దానికి ఆధారమైన మూలసత్యం! మరింత స్పష్టత కోసం ఆధునిక విజ్ఞానశాస్త్రం ప్రకారం కూడా -నిర్వచించుకోవలసిన అవసరం వుంది. విశ్వమంతా విద్యుత్ తరంగాలు వ్యాపించి వున్నాయని అంటారు శాస్త్రవేత్తలు. ఇవే ఎలక్ట్రాన్స్, న్యూట్రాన్స్, ప్రోటాన్స్. అదనంగా ఇంకా ఏవైనా తరంగాలు కూడా వుండి వుండవచ్చు. ఈ విద్యుత్ తరంగాల శక్తే ప్రపంచం అంతా ఆవరించి వున్నదని చెబుతారు. కానీ ఈ శక్తితరంగాలకు తనదైన అస్తిత్వం వున్నట్లు సైన్స్ చెప్పదు. ఈ శక్తి అస్తిత్వానికే ఒక 'ూబ్శీఝ్అష ఎఱజఱఅవ ఖ్షిఱశీఅ' వుంది అని చెబుతారు భారతీయ యోగులు. ఈ ఆటోమెటిక్ డివైన్ యాక్షనే ప్రకృతి నియమాలకు అతీతంగా పనిచేయగలదని అనేక దృష్టాంతాలు వున్నాయి. ఈ విశ్వశక్తి సృష్టికి పూర్వం వున్న సత్యమే! సృష్టికి పూర్వం అంటే 'నేను' అనే అస్తిత్వం రూపు తీసుకోకముందు అని కూడా అనుకోవచ్చు. హిందూ, క్రిస్టియన్, ఇస్లాం, జైనం, బౌద్ధం అన్ని మతాల్లోనూ ఈ సనాతనమే వుంటుంది. ధర్మం అంటే ఈ సనాతన సత్యాన్ని చేరుకునే మార్గమే! ఈ మార్గాన్నే మతం అని కూడా అంటాం. సనాతనం స్పృహ లేకుండా ఏ మతమూ వుండటానికి వీలులేదు. ఈ లెక్కన సనాతన సత్యానికి అన్ని మతాలూ శాఖలే! వీటిలో హిందూమతం అతి ప్రాచీన శాఖ అయివుండడానికి అవకాశం వుంది. ఈ ప్రాచీన మతపు ఆనవాళ్లు ఇప్పటికీ వివిధ దేశాల చారిత్రక తవ్వకాలలో బయటపడుతూనే వున్నాయి. సనాతనం దృష్ట్యా సర్వమతాలూ సోదర మతాలే అని గుర్తించవలసిన అవసరం కూడా వుంది. ఫలానా మతమే ప్రపంచ మతం కావాలనే వెర్రివిశ్వాసాన్ని విడిచిపెట్టవలె. పలుమతాల సమాజాన్ని స్వాగతించవలె. విదేశీ మతాలు మతపరంగా కంటే జాతి పరంగా మూలాలు వెదుక్కోవడం వివేకవంతమైన చర్య. అరబ్బులు అఫ్ఘాన్ మీద దాడి చేయడంతో భారతదేశంలో ముస్లింల చరిత్ర మొదలవుతుంది. ముస్లింలది పదమూడు వందల ఏళ్ల చరిత్ర. పోర్చుగీసు క్రిస్టియన్లు కాలికట్, గోవాల మీద దాడి చేయడంతో భారతదేశంలో క్రిస్టియన్ల చరిత్ర మొదలవుతుంది. క్రిస్టియన్లది ఐదు వందల సంవత్సరాల చరిత్ర. హిందువుల చరిత్ర ఎన్ని ఏండ్లది? ఎన్ని వేల సంవత్సరాల నాటిది హిందూమత చారిత్రక కాలంతో పోల్చినపుడు ఈ విదేశీ మతాల చారిత్రక కాలాలు కురచగానే వుంటాయి. ఈ కురచదనం ఈ నేలమీద వాటి వారసత్వాలను ప్రశ్నించే అవకాశం లేకపోలేదు. ఇవే విదేశీ మతాలు కేవలం తమ మతంతో మాత్రమే కాకుండా, ఇక్కడి తమ జాతి (ద్రవిడ)తోనూ, తమ మతంలో అంతర్లీనంగా వున్న సనాతనంతోనూ ఐడెంటిఫై అయినపుడు మాత్రమే వారు ఈ నేల వారసత్వాన్ని మరింత స్వేచ్ఛగా అనుభవించగలరు. సనాతనం మాదిరే అపభ్రంశ అర్థాలకు లోబడిన మతపారిభాషిక పదాలు విదేశీ మతాలలో కూడా వున్నాయి. 'నేను, నా తండ్రి ఒక్కటే' అనే వాక్యంలోని అద్వైత స్పృహను క్రిస్టియన్ మతం కోల్పోయింది. 'జిహాద్ అంటే ఆధ్యాత్మిక శక్తితో కనెక్టివిటీ కోసం మానవుడు తనతో తాను చేసే పోరాటం' అని చెబుతారు. కానీ మధ్యయుగాలలోగానీ, ఆధునిక కాలంలోగానీ జిహాద్ పోషిస్తున్న పాత్ర ఎటువంటిదో మనకు అవగతమే. హిందూమతంలోనూ- గుణకర్మలతో ఏర్పడిన వర్ణభేదాన్ని జన్మతో ముడిపెట్టిన మనువాదమూ మనకు తెలుసు. బ్రహ్మను తెలిసినవాడే బ్రాహ్మణుడు అన్న అర్థం పోయి, బ్రాహ్మణ్యం ఒక కులంగా స్థిరపడిన క్రమం కూడా తెలుసు. హిందూ మతం సుదీర్ఘ చరిత్రకు, అన్యదేశీ మతాల పరిమిత చరిత్రలకు మధ్య వున్న అగాధాన్ని తగ్గించుకోవలసిన అవసరాన్ని మైనారిటీలు గుర్తిం చవలె. ఇందుకు దక్కన్ సంస్కృతి వలె మత సంస్కృతులు అన్నీ సమ్మేళనం పొందవలె. పాకిస్తాన్ దేశం తన సంస్కృతి పరంగా చేసిన పొరబాటులను ఇక్కడి ముస్లింలు చేయరని ఆశిద్దాం. పాకిస్తాన్ ముస్లింలు టర్కీ సంస్కృతినో, అరబ్బు సంస్కృతినో సొంతం చేసుకోబోయి చతికిలబడిన సాంస్కృతిక దివాళాకోరుతనాన్ని ఇక్కడి ముస్లిములు మరువరాదు. వారు పుట్టిపెరిగిన ఈ నేల, ఈ జాతి, ఈ రక్తం (డీఎన్ఏ) మీదుగా నిర్మాణం అయిన దేశీయ సంస్కృతిని సొంతం చేసుకోవలె. భారతీయ ముస్లిములుగా ప్రపంచ ముస్లింలలో తమ విశిష్టతను చాటుకోవలె. మనువాదం, బ్రాహ్మణాధిక్యాలను విమర్శించినంత కాలం విమర్శించి నాము. ప్రస్తుతం బ్రాహ్మ ణాధిపత్యం లేని శూద్రుల హైందవంతో మన జాతీయ ఆసక్తులకు కొత్త రూపం ఇద్దాం. దర్గాలో, చర్చిలో, దేవాలయంలో... ఆవరణలు వేరువేరు. భక్తి ఒక్కటే! భగవంతుడు ఒక్కడే! సనాతన ధర్మమూ ఒక్కటే ఏ ఒక్క మతమూ దేవుడు కాదు. దేవుడు నుంచే మతం పుట్టింది కానీ, మతం నుంచీ దేవుడు పుట్టలేదు. అన్ని మతాలూ సనాతనాన్ని బోధిం చేవే. ఆ కాలాతీత సత్యాన్ని చేరుకోవడానికి మార్గం చూపేవే. హిందూ, క్రిస్టియన్, ఇస్లాం, జైనం, బౌద్ధం, జొరాస్ట్రియన్.. అన్ని మతాల లక్ష్యం ఈ సనాతన మార్గాన్ని చేరుకోవడమే! మతస్తులు అందరూ, మతానికి అతీతమైన ఆధ్యా త్మికతలో ఏకత్వం పొందవలె! అన్నీ సోదర మతాలే అని నమ్మినపుడు వాటి తల్లివేరు సనాతనం అనే ఏకైక సత్యంలోనే నాటుకున్న దని అర్థం చేసుకున్నపుడు మతాల మధ్య ఆధిపత్య వారసత్వాలు వుండవు. మతం కంటే జాతి వారసత్వము, జాతి కంటే సనాతనం నుండి దఖలు పడిన అనంత వారసత్వము సాధించు కోగలిగిన మహాత్వాలు

# చాయిస్ ఈజ్ యువర్స్ మిస్టర్ జగన్‌రెడ్డి




తమ కుటుంబంలో జరిగిన మూడు మరణాలను ప్రస్తావించడం ద్వారా మళ్లీ సానుభూతి పొందాలని జగన్ ప్రయత్నిస్తున్నారేమో తెలియదుగానీ తమ కుటుంబ రక్త చరిత్రను ఆయనే బయటపెట్టుకున్నారు. రాజారెడ్డి (వైఎస్ తండ్రి) ఎలాంటి వారు? ఎన్ని నేరాలు చేశారు? వంటి విషయాలను తాను సీఎం అయ్యాక ప్రజలు మరచిపోయేలా రాజశేఖరరెడ్డి చేయగలిగారు. పోయినోళ్లందరూ మంచోళ్లని సర్దుకుపోయే ఉదారవాదం మన నైజం కాబట్టే మరణానంతరం వైఎస్ 'మహానేతగా' మారిపోయారు. నిజానికి రాజారెడ్డి కంటే వైఎస్సే 'డేంజరస్' అని సీమకు చెందిన, మరీ ముఖ్యంగా కడపకు చెందిన ఆయన ప్రత్యర్థులు గజగజ వణుకుతూ వారికి ఎదురైన భయానక అనుభవాలను చెబుతుంటారు వైఎస్ మరణాన్ని కొంతకాలం, వివేకానంద రెడ్డి హత్యను మరికొంత కాలం రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్న జగన్ రెడ్డి తాను తులసి మొక్కను అని చెప్పుకోవడాన్ని మించిన జోక్ మరేమి ఉంటుంది? మనం మంచివాళ్లం అవునా కాదా అన్నది ముందుగా మన కుటుంబ సభ్యులే సర్టిఫికెట్ ఇవ్వాలి. జగన్ ఉత్తమ మానవుడు అని వైఎస్ కుటుంబ సభ్యుల్లో ఒక్కరైనా సర్టిఫికెట్ ఎందుకు ఇవ్వడం లేదన్న ప్రశ్నకు సమాధానం రావాలి కదా? నిజానికి వైఎస్ కుటుంబానికి ప్రారంభంలో ఆస్తిపాస్తులు పెద్దగా లేవు. రాజారెడ్డి తండ్రి వెంకటరెడ్డి చాలా చిన్న రైతు. రాజారెడ్డి ఫ్యాక్షన్ మార్గాన్ని ఎంచుకున్న తర్వాత వైఎస్ కుటుంబానికి ఆస్తులు సమకూరడం మొదలైంది. వైఎస్ సీఎం అయ్యాక జగన్ విన్యాసాలు చూశాం. ఈ దేశ చరిత్రలోనే ఎవరూ నిర్మించలేని విధంగా వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. పేర్ల పార్థసారథి రెడ్డి చెబుతున్నట్టుగా రాజారెడ్డి కుటుంబం రక్తపు కూడు తిని పెరిగిందన్న మాట! ఒళ్లంతా బురద పులుముకున్న ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాను పూసుకున్న బురదను ఇతరులకు అంటించాలనుకుంటున్నారు. మానవ జాతిలో తనను మించిన ఉత్తమ పురుషుడు మరొకరు లేరని భ్రమిస్తున్న ఆయన, తనను వ్యతిరేకించే వారందరూ అవినీతిపరులని, హంతకులని చిత్రించే ప్రయత్నం కూడా చేస్తున్నారు. అయితే ఉగాది పంచాంగ శ్రవణంలో ఆయన పిలిపించుకున్న పండితుడు ఈ ఏడాది గ్రహబలం అనుకూలంగా లేదని చెప్పినట్టుగానే జగన్‌రెడ్డి గురువారంనాడు విలేకరుల సమావేశంలో చేసిన విన్యాసాలు ఆయనకే ఎదురు తగిలాయి. తన తాత రాజారెడ్డి హత్య, తండ్రి రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదాలను ప్రస్తావించడం ద్వారా జనం మరచిపోయిన విషయాలను ఆయన గుర్తుచేశారు. తమ కుటుంబంలో జరిగిన హత్యలతో పాటు కొన్ని దశాబ్దాలుగా తెలుగునాట జరిగిన అనేక హత్యల వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారని చెప్పే ప్రయత్నం చేయడం ద్వారా 'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే' అనే సామెతను గుర్తుచేశారు. నిజానికి జగన్‌రెడ్డి తాత వైఎస్ రాజారెడ్డి గురించి ఈ తరానికి తెలియదు. ఆయనను ఎవరు.. ఎందుకు హత్య చేశారో కూడా తెలియదు. హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన రాజశేఖరరెడ్డిని మహా నేతగా భావిస్తున్న ఈ తరం వారికి ఆయనకు కూడా ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్న సంగతి తెలియదు. ఇప్పుడు పాత విషయాలను ప్రస్తావించడం ద్వారా తండ్రీ తాతల నేపథ్యం గురించి ఈ తరం వారు తెలుసుకొనే పరిస్థితిని జగన్‌రెడ్డి కల్పించారు. వైసీపీ అంటే గొడ్డలి పార్టీ అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవలి కాలంలో తరచుగా చురకలంటిస్తున్నారు. దీంతో జగన్‌రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి హత్యా రాజకీయాలకు చంద్రబాబు పెట్టింది పేరు అని, తాను మంచోడు కనుకే తాత రాజారెడ్డిని చంపినవాళ్లు ప్రశాంతంగా బతకగలుగుతున్నారని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు. అయితే రాజారెడ్డి వర్గీయులు చేసిన హత్యాయత్నం నుంచి ప్రాణాలతో బయటపడి ఆ తర్వాత తన వర్గీయులతో రాజారెడ్డిని చంపించిన పేర్ల పార్థసారథిరెడ్డి అప్పుడేం జరిగిందో కుండబద్దలు కొట్టారు. మొదట రాజారెడ్డి వర్గీయులు తనపై దాడి చేసి చంపే ప్రయత్నం చేశారని, ఆ సందర్భంగా తన శరీరంపై 26 కత్తిపోట్లు పడ్డాయని, తాను చనిపోయాననుకొని వదిలి వెళ్లిపోయారని ఆయన వివరించారు. అనంతరం తన వర్గీయులు రాజారెడ్డిపై దాడి చేసి చంపారని ఆయన జరిగింది జరిగినట్టుగా చెప్పుకొచ్చారు. వైఎస్ కుటుంబం వల్ల తన కుటుంబం ఆర్థికంగా చితికిపోయిందని కూడా ఆయన ఏకరువు పెట్టారు. పార్థసారథిరెడ్డిపై జరిగిన హత్యాయత్నం, ఆ తర్వాత జరిగిన రాజారెడ్డి హత్య ఫ్యాక్షన్ రాజకీయాలలో భాగమే! దాదాపు మూడు దశాబ్దాల క్రితం ఇవి జరిగాయి. అప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నారు. ఇప్పుడు నేను అంత మంచివాడిని, ఇంత మంచివాడిని అని చెప్పుకొంటున్న జగన్మోహన్‌రెడ్డి అప్పట్లో తన తాత రాజారెడ్డిపై దాడి చేసిన వారిని చంపాలనుకున్నారు. ఈ విషయాన్ని వైఎస్ రాజశేఖరరెడ్డి స్వయంగా అప్పటి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, అందరూ కాకాగా పిలుచుకొనే దివంగత వెంకటస్వామి వద్ద ప్రస్తావించారు. 'మా నాన్నను చంపినవాళ్లను చంపుతానని మా వాడు కత్తి పట్టుకొని తిరుగుతున్నాడు. జరగరానిది జరిగితే నా రాజకీయ జీవితం దెబ్బతింటుంది. ఏదైనా సలహా ఇవ్వండి' అని కాకాను రాజశేఖరరెడ్డి అప్పట్లో కోరారు. ఈ విషయాన్ని దివంగత వెంకటస్వామి ఓ సందర్భంలో నా వద్ద ప్రస్తావించారు. 'నీ కొడుకుని పులివెందుల పరిసరాల్లో ఉండనివ్వొద్దు' అని తాను రాజశేఖరరెడ్డికి సూచించినట్టు కాకా తెలిపారు. దీన్నిబట్టి జగన్‌రెడ్డి ఇప్పుడు చెప్పుకొంటున్నట్టుగా అంత మంచోడు కాదని స్పష్టమవుతోంది. తండ్రి రాజశేఖరరెడ్డి అడ్డుపడి ఉండకపోతే జగన్‌రెడ్డి చేతులకు కూడా రక్తం అంటి ఉండేదన్నమాట! కత్తి చేతబట్టినవాడు ఆ కత్తికే బలవుతాడు అని అంటారు. అప్పట్లో రెండు వర్గాలకు నాయకత్వం వహించిన రాజారెడ్డి, పార్థసారథిరెడ్డి ఫ్యాక్షన్ దాడులు జరిపించారు. రాజారెడ్డి మరణించగా, పార్థసారథిరెడ్డి ప్రాణాలు దక్కించుకున్నారు. ఇదంతా గతం. నిజానికి గురువారంనాడు ఏబీఎన్ డిబేట్‌లో పార్థసారథిరెడ్డి పాల్గొనే వరకు ఆయనే రాజారెడ్డిని చంపిన వారికి నాయకుడు అని ఈ తరానికి తెలియదు. రాజారెడ్డి హత్యా రాజకీయాలు చేసేవారన్న విషయం కూడా తెలియదు. ఇప్పుడు జగన్‌రెడ్డి పుణ్యమా అని వైఎస్ కుటుంబ నేర చరిత్ర గురించి తెలుసుకొనే అవకాశం ఈ తరానికి లభించింది. 2019--2024 మధ్య ఆంధ్రప్రదేశ్‌లో అమలైన 'రాజారెడ్డి రాజ్యాంగం' అంటే ఏమిటో ఇప్పుడు జనబాహుళ్యానికి మరింతగా అర్థమవుతోంది. పాపాలే.. శాపాలై! తన తండ్రి రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించడంపై ఇప్పటికీ అనుమానాలు ఉన్నాయని జగన్‌రెడ్డి తాజాగా చెప్పడం ఈ మొత్తం ఎపిసోడ్‌లో హైలెట్! ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌రెడ్డి తన తండ్రి రాజశేఖరరెడ్డి మరణంపై అనుమానాలు ఉన్నాయని ఒక్కసారి కూడా చెప్పలేదు. నాటి సంఘటనపై విచారణ జరిపించే ఆలోచనా చేయలేదు. రాజశేఖరరెడ్డి మరణం వల్ల ప్రజల్లో పెల్లుబికిన సానుభూతిని తన రాజకీయ పరమపద సోపానానికి వాడుకున్న జగన్‌రెడ్డి, అధికారంలోకి రాగానే అన్నీ మరచిపోయారు. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో రాజశేఖరరెడ్డి పేరు కూడా ప్రస్తావనకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. రాజశేఖరరెడ్డి మరణం తర్వాత హెలికాప్టర్ ప్రమాదం వెనుక కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ హస్తం ఉందని కొంతకాలం, ఆ తర్వాత రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ హస్తం ఉందని మరికొంత కాలం ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు. విచిత్రమేమిటంటే, అవినీతి కేసులలో జైలు జీవితం అనుభవించిన జగన్‌రెడ్డి బెయిల్ కోసం అదే సోనియాగాంధీని, అదే ముఖేశ్ అంబానీని ఆశ్రయించారు. ముఖ్యమంత్రి అయ్యాక ఈ ఇరువురి గురించి ఎక్కడా, ఎప్పుడూ ప్రస్తావించలేదు. పైగా ముఖేశ్ అంబానీని, ఆయన కుమారుడు అనంత్ అంబానీని తన ఇంటికి ఆహ్వానించి అతిథి మర్యాదలు చేశారు. ముఖేశ్ అంబానీ కోరికను మన్నించి పరిమళ్ నత్వానీకి తమ పార్టీ తరపున రాజ్యసభ టికెట్ ఇచ్చి సత్కరించారు. దీన్నిబట్టి హెలికాప్టర్ ప్రమాదం తర్వాత జగన్‌రెడ్డి చేసిన ఆరోపణలన్నీ పచ్చి అబద్ధాలని స్పష్టమవుతోంది. ఇంత కాలానికి మళ్లీ తండ్రి మరణంపై అనుమానాలు ఉన్నాయని చెబుతున్నారంటే శవ రాజకీయాలకు మళ్లీ తెర లేస్తోందన్న మాట! ఇప్పుడు తాజాగా ఆయన చంద్రబాబుపై అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. అయితే ఈ మొత్తం ఎపిసోడ్‌లో ఒక విషయం గమనించాలి. రాజారెడ్డి హత్య జరిగినప్పుడు ఆయనపై దాడి చేసిన వారిపై పగ తీర్చుకోవాలని భావించిన జగన్‌రెడ్డి, తన తండ్రి మరణం తర్వాత ఆరోపణలు ఎన్ని చేసినా పగ, ప్రతీకారాల జోలికి పోకుండా ముఖ్యమంత్రి పదవి కోసం అర్రులు చాచారు. జనాల్లో సానుభూతి పెంపొందించి అదంతా తన రాజకీయ ఎదుగుదలకు ఉపయోగపడేలా జాగ్రత్తపడ్డారు. తాత మరణం నుంచి తండ్రి మరణం వరకు జగన్‌రెడ్డిలో వచ్చిన మార్పు ఇదన్నమాట! ఇంత కాలం తర్వాత ఇప్పుడు మళ్లీ చంద్రబాబుపై అనుమానాలు ఉన్నాయని చెప్పడం వల్ల ప్రయోజనం ఏమిటో జగన్‌కే తెలియాలి. తమ కుటుంబంలో జరిగిన మూడు మరణాలను ప్రస్తావించడం ద్వారా మళ్లీ సానుభూతి పొందాలని జగన్ ప్రయత్నిస్తున్నారేమో తెలియదుగానీ తమ కుటుంబ రక్త చరిత్రను ఆయనే బయటపెట్టుకున్నారు. రాజారెడ్డి ఎలాంటి వారు? ఎన్ని నేరాలు చేశారు? వంటి విషయాలను ముఖ్యమంత్రి అయ్యాక ప్రజలు మరచిపోయేలా రాజశేఖరరెడ్డి చేయగలిగారు. తమ కుటుంబానికి గౌరవ ప్రతిష్ఠలు లభించేలా కృషి చేశారు. రాజశేఖరరెడ్డి రాజకీయాలలో రాణించక ముందు రాజారెడ్డిని సాదాసీదా పాలెగాడిగానే ప్రజలు చూశారు. పులివెందుల వరకే అతని ప్రభావం ఉండేది. రాజశేఖరరెడ్డి రాజకీయాలలో అంచెలంచెలుగా ఎదిగి ముఖ్యమంత్రి అయ్యాక వైఎస్ కుటుంబానికి ఉన్న ఫ్యాక్షన్ నేపథ్యాన్ని ప్రజలు మరచిపోయారు. ఇప్పుడు పార్థసారథిరెడ్డి గురువారంనాడు 'ఏబీఎన్' డిబేట్‌లో చెప్పిన విషయాలతో వైఎస్ కుటుంబ నేపథ్యం మళ్లీ ప్రజల్లో చర్చకు వచ్చింది. తన తాత ఎలాంటివాడో ఇప్పటి ప్రజలకు తెలియడానికి జగన్‌రెడ్డి కారకుడు కావడం గమనార్హం! రాజశేఖరరెడ్డి మరణం తర్వాత ఆయన కుటుంబం ఛిన్నాభిన్నం అయింది. కుటుంబ పెద్ద పోతే ఎంత పెద్ద కుటుంబం అయినా ఇలా అయిపోతుందా అని ఆశ్చర్యపోవడం ప్రజల వంతయింది. రాజశేఖరరెడ్డి సోదరుడు వివేకానందరెడ్డి దారుణ హత్యకు గురయ్యారు. కుటుంబంలో అంతఃకలహాలు, ఆస్తి తగాదాలు పరాకాష్ఠకు చేరాయి. రాజశేఖరరెడ్డి సతీమణి విజయలక్ష్మి అడకత్తెరలో పోకలా కొడుకు--కుమార్తె మధ్య నలిగిపోతున్నారు. ఈ పరిస్థితికి జగన్‌రెడ్డి కారణం కాదా? రాజశేఖరరెడ్డి కుటుంబానికి చెందిన ఒకరిని ఇదే విషయమై ప్రశ్నించగా, పుణ్యంకొద్దీ పురుషుడు.. దానంకొద్దీ బిడ్డలు అని చెబుతారని వ్యాఖ్యానించారు. జగన్‌రెడ్డి స్థానంలో తాను ఉండి ఉంటే ఆస్తి అంతా షర్మిలకు ఇచ్చి ఉండేవాడినని ఆయన అన్నారు. నిజానికి వైఎస్ కుటుంబానికి ప్రారంభంలో ఆస్తిపాస్తులు పెద్దగా లేవు. రాజారెడ్డి తండ్రి వెంకటరెడ్డి చాలా చిన్న రైతు. రాజారెడ్డి ఫ్యాక్షన్ మార్గాన్ని ఎంచుకున్న తర్వాత వైఎస్ కుటుంబానికి ఆస్తులు సమకూరడం మొదలైంది. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక జగన్‌రెడ్డి విన్యాసాలు చూశాం. ఈ దేశ చరిత్రలోనే ఎవరూ నిర్మించలేని విధంగా వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. పేర్ల పార్థసారథిరెడ్డి చెబుతున్నట్టుగా రాజారెడ్డి కుటుంబం రక్తపు కూడు తిని పెరిగిందన్న మాట! బహుశా నాటి పాపాలే నేటి శాపాలుగా మారి రాజశేఖరరెడ్డి కుటుంబాన్ని వేధిస్తున్నాయని భావించాలేమో.దతులసి మొక్కా.. అదెలా? ఇప్పుడు జగన్‌రెడ్డి నోటి వెంట వెలువడిన ఆణిముత్యాల గురించి చర్చించుకుందాం. ప్రస్తుత రాజకీయాలను గంజాయి వనంగా పోల్చుతూ అందులో తాను తులసి మొక్కను అని జగన్ చెప్పుకొంటున్నారు. విలువలు, విశ్వసనీయతతో కూడిన రాజకీయం చేస్తానని నమ్మబలుకుతున్నారు. జగన్‌రెడ్డి నోటి వెంట ఇలాంటి పదాలు వెలువడినప్పుడు అతని వెనుక ఉన్న వాళ్లకు కూడా నవ్వు ఆగడం లేదు. జగన్‌రెడ్డి నిజంగా తులసి మొక్కే అయితే గత ఎన్నికల్లో తులసి మొక్కను ప్రజలు ఎందుకు పీకి పక్కన పడేశారన్న ప్రశ్న ఉత్పన్నం అవుతుంది కదా? కన్నతల్లిని క్షోభకు గురిచేస్తూ, రక్తం పంచుకు పుట్టిన చెల్లిని ఆస్తి కోసం తరిమేసిన జగన్‌రెడ్డి మంచోడు ఎలా అవుతారు? తులసి మొక్క ఎలా అవుతారు? అయితే అలాంటి తులసి మొక్కను పీకి పడేసిన ప్రజలు గంజాయి మొక్కలా? 'చారిటీ బిగిన్స్ ఎట్ హోం' అని అంటారు. మనం మంచివాళ్లం అవునా కాదా అన్నది ముందుగా మన కుటుంబ సభ్యులే సర్టిఫికెట్ ఇవ్వాలి. జగన్‌రెడ్డి ఉత్తమ మానవుడు అని రాజశేఖరరెడ్డి కుటుంబ సభ్యుల్లో ఒక్కరైనా సర్టిఫికెట్ ఎందుకు ఇవ్వడం లేదన్న ప్రశ్నకు సమాధానం రావాలి కదా? జగన్‌రెడ్డి వివాహం.. డాక్టర్ సునీత వివాహం ఒకే రోజు, ఒకే చోట జరిగాయి. అలా కలసి మెలసి ఉండిన కుటుంబం ఇప్పుడు చెల్లాచెదరు కావడానికి జగన్‌రెడ్డి కారణం కాదా? మా జగనన్న మంచోడు అని డాక్టర్ సునీత ఇప్పుడు చెప్పగలరా? తన తండ్రి వివేకాను చంపించిన వారికి శిక్ష పడేలా చేయమని అర్థించిన ఆమెను పట్టించుకోని జగన్‌రెడ్డి మంచోడు ఎలా అవుతారు? జగనాజ్ఞ లేనిదే చీమైనా కుట్టని పులివెందులలో స్వయానా ఆయన బాబాయ్‌ని చంపే ధైర్యం ఎవరికుంటుంది? కనీసం వివేకా హంతకులెవరో కూడా తెలియనంత అమాయకుడా జగన్? వివేకా హంతకుల్ని ఆయనే కాపాడుతున్నారన్న బాధితుల ఆరోపణలకు ఎదురుదాడే సమాధానం తులసి మొక్కలు అవుతారా

# టీజీఆర్టీసీ బస్సుల్లో కెమెరా నిఘా

-బస్సుల్లో నిఘా కళ్లు.. నేరాలకు చెక్..
-ఎండీ నాగిరెడ్డి వినూత్న నిర్ణయం..
-ఆదిలాబాద్‌లో బస్సులో భరోసా ప్రయోగాత్మక ప్రారంభం..

ఆదిలాబాద్, మే 24 ( హంసకలం వార్త )

ప్రజా రవాణాలో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మరో కీలక నిర్ణయంతో ముందుకొచ్చింది. ప్రయాణికుల రక్షణ, మహిళల భద్రత, బస్సుల్లో జరుగుతున్న చోరీలు అవాంఛనీయ ఘటనలకు అడ్డుకట్ట వేసేందుకు టీజీఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో అత్యాధునిక నిఘా వ్యవస్థ అమలులోకి వచ్చింది. బస్సులో భరోసా పేరుతో రూపొందించిన ఈ ప్రత్యేక భద్రతా ప్రాజెక్టును తొలి దశలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు కింద ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని సుమారు 175 బస్సుల్లో ఆధునిక సీసీ కెమెరాలను అమర్చారు. డ్రైవర్ క్యాబిన్, మహిళల ప్రత్యేక సీట్లు, ఫుట్‌బోర్డు, బస్సు చివరి వరుస వరకు ప్రతి కదలిక స్పష్టంగా రికార్డు అయ్యేలా ప్రత్యేక సాంకేతిక పద్ధతిలో కెమెరాలను ఏర్పాటు చేశారు. బస్సులోకి ఎక్కే ప్రతి వ్యక్తి కదలికలతో పాటు ప్రయాణ సమయంలో జరిగే ప్రతి



ఘటన ఈ నిఘా వ్యవస్థలో నమోదవుతుంది. ఈ దృశ్యాలను డ్రైవర్, కండక్టర్‌తో పాటు ఆర్టీసీ నియంత్రణ కేంద్రం కూడా నిరంతరం పర్యవేక్షించే విధంగా వ్యవస్థను అనుసంధానించారు. దీంతో దొంగతనాలకు పాల్పడే ముఠాలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను ముందుగానే గుర్తించే అవకాశం ఏర్పడనుంది. ఏదైనా ప్రమాదం లేదా అవాంఛనీయ ఘటన జరిగినా వెంటనే ఖచ్చితమైన ఆధారాలు లభించే అవకాశం ఉండటంతో భద్రత మరింత బలోపేతం కానుంది. మహిళలపై వేధింపులు, చోరీలు, అసభ్య ప్రవర్తన వంటి ఘటనలను అరికట్టేందుకు టీజీఆర్టీసీ తీసుకున్న ఈ నిర్ణయంపై ప్రజల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఒంటరిగా ప్రయాణించే మహిళలు, వృద్ధులు ఈ నిఘా వ్యవస్థపై ఆనందం



వ్యక్తం చేస్తున్నారు. బస్సులో కెమెరాలు ఉన్నాయనే భయం నేరగాళ్లలో గుబులు రేపుతుందని, ప్రయాణం మరింత సురక్షితంగా మారుతుందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. కెమెరాల ఏర్పాటు వల్ల డ్రైవింగ్ ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు సిబ్బంది పనితీరులో కూడా బాధ్యత పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు ఫలితాలను పరిశీలించిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల బస్సుల్లో ఈ నిఘా వ్యవస్థను విస్తరించేందుకు టీజీఆర్టీసీ యాజమాన్యం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రజల భద్రత కోసం సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తున్న ఎండీ నాగిరెడ్డి నిర్ణయంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు..

# రోడ్డు పనులు..నీటి కష్టాలు

-100 ఫీట్ రోడ్డు పనులతో పైప్‌లైన్ పగులు..
-కేటీఆర్ నగర్‌లో మూడు రోజులుగా నీటి కష్టాలు..
-అర్ధరాత్రే ట్యాంకర్లతో రంగంలోకి రామకృష్ణ గౌడ్..
-పైప్‌లైన్‌కు శాశ్వత పరిష్కారం హామీ..

ఉషముళ్ళపూడి, మే 24 ( హంసకలం వార్త )

ఉషముళ్ళపూడి కమాన్ నుంచి గాజులరామరం వరకు ఎల్లమ్మబండ మీదుగా చేపడుతున్న 100 ఫీట్ ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఎల్లమ్మబండ ఎన్‌టీఆర్ నగర్ కమాన్ వద్ద మంజీరా తాగునీటి పైప్‌లైన్ పగిలిపోవడంతో కేటీఆర్ నగర్ కాలనీకి గత రెండు మూడు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానికుల సమస్య తెలుసుకున్న యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. రాత్రి వేళల్లోనే తాగునీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసి కాలనీ ప్రజలకు తాగునీరు అందించారు. ఈ సందర్భంగా దొడ్ల రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, ప్రజా ఖాతాల కమిటీ చైర్మన్ అరేకపూడి గాంధీ, అల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆదేశాల మేరకు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా అందించామని, పగిలిన పైప్‌లైన్‌కు వెంటనే



మరమ్మత్తులు చేపట్టి సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందిస్తామని హామీ ఇచ్చారు. తాగునీటి సమస్యపై తక్షణమే స్పందించి ట్యాంకర్ల ద్వారా నీరు అందించిన దొడ్ల రామకృష్ణ గౌడ్‌కు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షౌకత్ అలీ మున్నా, బాబాన్, గౌస్, కాలనీ వాసులు పాల్గొన్నారు..

# పీజేఆర్ శిలాఫలకం రగడ..కాంగ్రెస్ ఫైర్

కూకట్‌పల్లి, మే 24 ( హంసకలం వార్త )

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల జస్వంత్ రావు వసంత్‌నగర్ కాలనీలో పర్యటించి రాజకీయ వేడి పెంచారు. తన రాజకీయ గురువు, మాజీ మంత్రి పి. జనార్దన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించబడిన అభివృద్ధి శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన ఘటనపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. వివాదం చెలరేగడంతో సంబంధిత వారు అనంతరం శిలాఫలకాన్ని పునరుద్ధరించారు. ఈ నేపథ్యంలో సంఘటన స్థలానికి చేరుకున్న గొట్టిముక్కల జస్వంత్ రావు, పి. జనార్దన్ రెడ్డి స్మృతికి సూచకంగా పునరుద్ధరించిన శిలాఫలకానికి పూలమాల వేసి, కొబ్బరికాయ కొట్టి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని పీజేఆర్ సేవలను స్మరించుకున్నారు. అనంతరం కొండాపూర్‌లో వెంకటేశ్వర రావు ఎంవీ రావు, వరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన శుభం గ్రాండ్ హోటల్ అండ్ బ్యాంకెట్ హాల్ ప్రారంభోత్సవ



కార్యక్రమంలో పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరేకపూడి గాంధీతో కలిసి జస్వంత్ రావు పాల్గొన్నారు. హోటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అలాగే నరన్ శేఖర్ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఇదే సమయంలో ఈ నెల 27న ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కూకట్‌పల్లి నియోజకవర్గ పర్యటనకు రానుండటంతో



కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తమయ్యాయి. మంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో గొట్టిముక్కల జస్వంత్ రావు పాల్గొని స్థానిక నాయకులతో విస్తృతంగా చర్చించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ శక్తిని చాటేలా సభలు, కార్యక్రమాలు నిర్వహించాలని నాయకులకు సూచించినట్లు సమాచారం..

# కుత్బుల్లాపూర్ అభివృద్ధికి కేపీ హామీ

కుత్బుల్లాపూర్, మే 24 ( హంసకలం వార్త )

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజల అభివృద్ధి, సంక్షేమమే తన ప్రధాన ధ్యేయమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ స్పష్టం చేశారు. కుత్బుల్లాపూర్‌లోని తన నివాస కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మహిళా నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి పలు ఆహ్వాన పత్రాలు, వినతి పత్రాలు అందజేశారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ ప్రజలు తనను కుటుంబ సభ్యుడిగా భావించి వరుసగా మూడోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించి గెలిపించారని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే దిశగా సంక్షేమం, అభివృద్ధిని జోడెడ్లుగా తీసుకుని నిరంతరం పనిచేస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమ లులో ఎప్పటి కప్పుడు ముందుంటా మని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ వెల్లడించారు. ప్రజల ఆదరణ, కార్యకర్తల అండతో



కుత్బు ల్లాపూర్‌ను అన్ని రంగాల్లో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతుందని చెప్పారు..

## సుడా, జిల్లా గ్రంథాలయాల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలి

-డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
-కార్యకర్తల త్యాగాలను ప్రభుత్వం ఎప్పటికీ మర్చిపోదు..
-సంక్షేమ పథకాలను గ్రామ, గ్రామానికి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపు..
-జూన్ 2 నుంచి ఇందిరమ్మ బీమా పథకం అమలు..
-మహిళల ఆర్థిక బలోపేతానికి వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం కొనసాగింపు..
-ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..
-సుడా, జిల్లా గ్రంథాలయ చైర్మన్ లకు నిర్వహించిన అభినందన సభలో పాల్గొన్న డిప్యూటీ సీఎం..



మే 24 ( హంసకలం వార్త )

కష్టకాలంలో సైతం అండగా నిలిచిన కార్యకర్తలను ప్రభుత్వం ఎప్పటికీ మర్చిపోదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో స్తంభాద్రి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ ఖాదర్ బాబాలకు ఆదివారం నిర్వహించిన అభినందన సభలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్యేలు డాక్టర్ మట్ట రాగమయి, రాందాస్ నాయక్, కూనంనేని సాంబశివరావు లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ నాయకులకు పదవులు వచ్చినప్పుడు కార్యకర్తలు చూపుతున్న ఆనందం పార్టీపై ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. దేశ స్వాతంత్ర్య సమరానికి ముందే గ్రంథాలయ ఉద్యమాలు ప్రజల్లో చైతన్యం నింపాయని, ముఖ్యంగా ఖమ్మం, సూర్యాపేట, జనగాం ప్రాంతాలు ఆ ఉద్యమాలకు కేంద్ర బిందువులుగా నిలిచాయని పేర్కొన్నారు. ప్రజలపై అత్యంత ప్రభావం చూపే సంస్థ గ్రంథాలయమని, అలాంటి సంస్థకు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మహమ్మద్ ఖాదర్ బాబాకు అభినందనలు తెలిపారు. సుడా, జిల్లా గ్రంథాలయ సంస్థల ద్వారా ప్రజలకు మరింత మేలు జరిగేలా పని చేయాలని సూచించిన ఆయన, ప్రజలకు సేవలు అందించేందుకు అవసరమైన సహకారం స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు తప్పనిసరిగా అందిస్తారని అన్నారు. 2014 నుంచి 2023 వరకు రెండు పర్యాయాలు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్ జెండాను భుజాన వేసుకుని కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన నాయకులు, కార్యకర్తలను ప్రభుత్వం ఎప్పటికీ నిర్లక్ష్యం చేయదని స్పష్టం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ప్రజల అభివృద్ధి కోసం సాధించుకున్నామని, గత పాలకులు ప్రజల అవసరాలను పక్కనపెట్టి రాష్ట్రాన్ని కుటుంబ ప్రయోజనాల కోసం వినియోగించారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల కోసం పోరాటం చేశారని, ఆ పోరాటం చేసిన ఒక్క కార్యకర్తను కూడా మర్చిపోమని అన్నారు. యువజన విభాగం, మహిళా కమిటీలు, మండల నాయకుల సేవలను గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చిన డిప్యూటీ సీఎం, ప్రస్తుతం మార్కెట్‌లో కిలో 55 రూపాయలు ఉన్న సన్న బియ్యాన్ని కోటి ఆరు లక్షల కుటుంబాలకు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం లేదన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పేరుతో ప్రజలను మోసం చేశారని, ప్రస్తుతం ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు అందిస్తూ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో 5 లక్షలు జమ చేస్తున్నామని తెలిపారు. మొదటి విడతలోనే నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని, రెండవ విడత ఇండ్ల మంజూరుకు మంత్రి వర్గం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. 53 లక్షల నిరుపేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నా మని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం మహిళలకు 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీకి 550 బస్సులు కేటాయించినట్లు చెప్పారు. ప్రతిపక్షాలు అనవసర ఆరోపణలు చేస్తున్నాయని, పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని, ప్రభుత్వ పాఠశాల్లో బ్రేక్ ఫాస్ట్, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రవేశపెట్టబోతున్నా మని తెలిపారు. జూన్ 2 నుంచి కోటి 15 లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభిస్తున్నామని, 5 లక్షల బీమా సహాయం రక్షణ కవచంలా నిలుస్తుందని తెలిపారు. గ్రామ గ్రామానికి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలు అందిస్తామని, కార్యకర్తలు వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి పనిచేసిన నాయకులకు నేడు సుడా చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవులు రావడం సంతోషకరమని అన్నారు. నిబద్ధత, నిజాయితీతో పనిచేస్తే రాష్ట్ర నాయకత్వం తప్పకుండా గుర్తింపు ఇస్తుందని చెప్పారు. పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ కు పదవి రావడం తనకు వ్యక్తిగతంగా ఆనందంగా ఉందని, ఖమ్మం నగరంతో పాటు పరిసర మండలాల అభివృద్ధికి సుడా ద్వారా మరిన్ని నిధులు తీసుకురావాలని సూచించారు. ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని ముగ్గురు మంత్రులు ఖమ్మం అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి అప్పులు ఉన్నప్పటికీ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఎలాంటి లోటు లేకుండా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. డిప్యూటీ సీఎం, మంత్రి, ఖమ్మం ఎంపీ, సుడా చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌లను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఈత సరదా విషాదంగా మారకుండ జాగ్రత్తపడుదాం

-తల్లిదండ్రులు తమ పిల్లలను చెరువులు కాలువలు, కుంటల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

-జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.



మే 24 ( హంసకలం వార్త )

వేసవికాలంలో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు రావడంతో ఎంతో మంది పిల్లలు యువకులు ఎండ వేడి నుంచి సేద తీరటానికి, ఈత నేర్చుకోవడానికి చెరువులు , కాలువల వద్దకు ఈతకు వెళ్లే అవకాశం ఉన్నందున ఇట్టి క్రమంలో ప్రమాదాలు జరిగి నీటిలో మునిగి ప్రాణ నష్టం జారిగే అవకాశం ఉన్నందున అందరూ ఇట్టి విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈత సరదా విషాదంగా మారకూడదని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఐపిఎస్ సూచించారు. ఈత రానివారు బావులు చెరువుల వద్దకు ఒంటరిగా వెళ్లకూడదని ఈత నేర్చుకునే వారు వారి తల్లిదండ్రుల సమక్షంలో నేర్చుకోవాలని సూచించారు. ముఖ్యముగా తల్లిదండ్రులు తమ పిల్లలను చెరువుల వద్దకు కాలువల వద్దకు కుంటలు వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏదైనా అనుకోని సంఘటన జరిగినట్లయితే పిల్లల ప్రాణానికి ప్రమాదమని ఇట్టి విషయంలో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకొని పిల్లలను యొక్క కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని ఎస్పీ తల్లిదండ్రులకు సూచించారు.

## దినదినం ఇంధన ధరల పెంపు దేశ ప్రజలకు గొడ్డలి పెట్టు

-సామాన్యుల జీవనంపై భారమవుతున్న పెట్రోల్, డీజిల్ విధానాలు

మే 24 ( హంసకలం వార్త )

దేశంలో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు రోజురోజుకీ పెరుగుతుండటం ప్రజల జీవనాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టేస్తోంది. ఒకప్పుడు ఇంధన ధరల పెంపు అరుదుగా జరిగేది. కానీ,నేడు అంతర్జాతీయ మార్కెట్ మార్పులు, పన్నుల భారం,కార్పొరేట్ ప్రయోజనాలు,ప్రభుత్వాల ఆర్థిక విధానాల కారణంగా ఇంధన ధరలు నిరంతరం పెరుగుతున్నాయి.ఈ పెరుగుదల కేవలం వాహనదారుల సమస్య మాత్రమే కాదు.దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తాన్ని ప్రభావితం చేసే అంశం. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఇది "గొడ్డలి పెట్టు"గా మారింది.ఇంధనం అనేది ఆధునిక సమాజానికి ప్రాణాధారం.వ్యవసాయం నుంచి పరిశ్రమల వరకు, రవాణా నుంచి విద్యుత్ ఉత్పత్తి వరకు ప్రతి రంగం ఇంధనంపై ఆధారపడి ఉంటుంది.అలాంటి ఇంధన ధరలు పెరిగితే అన్ని వస్తువుల ధరలు పెరుగుతాయి.రైతు పొలంలో ట్రాక్టర్ నడపాలన్నా డీజిల్ అవసరం.పంట మార్కెట్‌కు తరలించాలన్నా రవాణా ఖర్చు పెరుగుతుంది.చివరికి రైతుకు గిట్టుబాటు ధర రాదు.వినియోగదారుడికి అధిక ధరలు తప్పవు. ప్రస్తుతం దేశంలో సామాన్య ప్రజల పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది.ఒకవైపు నిరుద్యోగం,మరోవైపు ధరల పెరుగుదల ప్రజల జీవనాన్ని దెబ్బతీస్తున్నాయి ఇంటి అద్దెలు,విద్యా ఖర్చులు,వైద్య ఖర్చులు పెరుగుతున్న వేళ ఇంధన ధరల పెంపు కుటుంబ బడ్జెట్‌ను పూర్తిగా అస్థిరం చేస్తోంది.నెల జీతంతో జీవించే ఉద్యోగులు,చిన్న వ్యాపారులు,ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు,డెలివరీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఇంధన ధరల పెరుగుదలతో రవాణా ఛార్జీలు పెరుగుతున్నాయి.బస్సు చార్జీలు,లారీ రవాణా ఖర్చులు పెరగడంతో కూరగాయలు,నిత్యావసర సరుకులు,పాలు,గ్యాస్ వంటి వస్తువుల ధరలు కూడా అమాంతం పెరుగుతున్నాయి.దీని ప్రభావం నేరుగా పేదల ఆహారపు అలవాట్లపై పడుతోంది.ప్రజలు అవసరాలను తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.కేంద్ర ప్రభుత్వం ఇంధనంపై భారీ ఎక్సైజ్ సుంకాలు విధించడం వల్లే ధరలు అధికంగా ఉన్నాయని అనేక ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గినప్పటికీ దేశంలో వినియోగదారులకు ఆ ప్రయోజనం పూర్తిగా అందడం లేదు.ప్రభుత్వ ఆదాయ వనరుగా ఇంధనాన్ని ఉపయోగించడం వల్ల ప్రజలపై అధిక భారం పడుతోంది. ఎన్నికల సమయంలో ధరలు నియంత్రించి,ఎన్నికల అనంతరం మళ్లీ పెంచడం కూడా రాజకీయ స్వార్థాన్ని సూచిస్తోంది.ప్రభుత్వ రంగ చమురు సంస్థలను బలహీనపరచడం,ప్రైవేటీకరణకు ప్రాధాన్యత ఇవ్వడం కూడా ఇంధన రంగంలో సమస్యలను పెంచుతోంది. కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం ప్రజలపై భారాలు మోపడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ప్రజల అవసరాల కంటే మార్కెట్ ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత ఇస్తే సామాజిక అసమానతలు మరింత పెరుగుతాయి.ఇంధన ధరల పెరుగుదల మహిళల జీవితాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది.వంటగ్యాస్ ధరలు పెరగడంతో అనేక కుటుంబాలు మళ్లీ కట్టెల పొయ్యిల వైపు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇది ఆరోగ్య సమస్యలకు, పర్యావరణ నష్టానికి దారితీస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో పేద మహిళలు మరింత కష్టాలు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రజల బాధలను అర్థం చేసుకొని తక్షణ చర్యలు తీసుకోవాలి. ఇంధనంపై విధిస్తున్న అధిక పన్నులను తగ్గించాలి.ప్రభుత్వ రంగ చమురు సంస్థలను బలోపేతం చేయాలి.ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయాలి. ప్రత్యామ్నాయ ఇంధన వనరులకు ప్రోత్సాహం ఇవ్వాలి.ముఖ్యంగా పేద,మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కలిగించే విధానాలు అమలు చేయాలి.దేశ ఆర్థిక అభివృద్ధి అంటే కేవలం కార్పొరేట్ లాభాలు కాదు.ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడితేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది.ఇంధన ధరల నియంత్రణ ప్రజల ఆర్థిక భద్రతకు కీలకం.లేకపోతే ధరల భారంతో సామాన్యుల జీవితం మరింత సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉంది.ప్రజల కష్టాలను పట్టించుకోని పాలన ఎప్పటికీ నిలబడదు. ఇంధన ధరల పెంపును నియంత్రించడం ప్రభుత్వ బాధ్యత. ప్రజలపై భారాలు మోపే విధానాలకు బదులు ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చే ఆర్థిక విధానాలే దేశ భవిష్యత్తును రక్షిస్తాయి.

# పంట అవశేషాలను కాల్చవద్దని గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క






-యాసంగి ధాన్యం కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహించిన మంత్రి ఉత్తమ్‌కు అభినందనలు..

-సన్‌ఫ్లవర్ కొనుగోళ్లకు వెంటనే అవసరమైన ఏర్పాట్లు చేయాలి..

-ఖమ్మం జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయి..

-గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో ధాన్యం చెల్లింపులు..

-మే చివరి నాటికి ధాన్యం కొనుగోలు వంద శాతం పూర్తి చేయాలి...

-మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

-ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టరేట్ నుండి పాల్గొన్న డిప్యూటీ సిఎం..

మే 24 ( హంసకలం వార్త )

పంట అవశేషాలను కాల్చవద్దని గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమీషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో ఖమ్మం కలెక్టరేట్ నుంచి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్., పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి పాల్గొన్నారు.

-డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ

యాసంగి ధాన్యం కొనుగోళ్లను అనేక సవాళ్ల మధ్య కూడా విజయవంతంగా కొనుగోలు నిర్వహించిన పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ ఏడాది భారీ స్థాయిలో వరి దిగుబడి వచ్చినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల మంత్రివర్గం సన్‌ఫ్లవర్ పంట కొనుగోలుకు ఆమోదం తెలిపిందని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు వెంటనే చేయాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని, అధికారులు సమర్థవంతంగా పనిచేశారని డిప్యూటీ సీఎం ప్రశంసించారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 1,23,560 మెట్రిక్ టన్నుల ధాన్యం రాగా, అందులో 1,12,922 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని తెలిపారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే ఉందని, మరో 16 వేల టన్నుల వరకు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. మిగిలిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గతంలో రైతులకు ధాన్యం చెల్లింపులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవని, కానీ ప్రస్తుతం ప్రజా ప్రభుత్వ పాలనలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గంటల వ్యవధి లోనే రైతుల ఖాతాల్లో చెల్లింపులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పట్టణాభివృద్ధిలో వాయు కాలుష్య నియంత్రణ కీలకమని, పంట అవశేషాలను పొలాల్లో కాల్చడం కూడా వాయు కాలుష్యానికి ప్రధాన కారణాల్లో ఒకటని డిప్యూటీ సీఎం తెలిపారు. దీనివల్ల కాలుష్యంతో పాటు పక్క పొలాలకు మంటలు వ్యాపించి ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని అన్నారు. పతి గ్రామంలో పంట అవశేషాలను కాల్చకుండా టామ్‌టామ్ ద్వారా రాబోయే 15 నుంచి 30 రోజుల పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన తర్వాత కూడా ఎవరైనా పంట అవశేషాలను కాల్చేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేయాలని సూచించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ. మే చివరి నాటికి ధాన్యం కొనుగోలు వంద శాతం పూర్తయ్యేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానికంగా ఉండే హమాలీలు, రవాణా సమస్యల పరిష్కారానికి మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వంద శాతం పెండింగ్ రైస్ డెలివరీ పూర్తి చేసిన డిఫాల్ట్ రైస్ మిల్లర్ల నుంచి అండర్ టేకింగ్ తీసుకుని ధాన్యం కేటాయింపు చేయాలని మంత్రి పేర్కొన్నారు.

-మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ

మంత్రివర్గం సన్‌ఫ్లవర్ కొనుగోలుకు ఆమోదం తెలిపిందని, అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని అన్నారు. చివరి గింజ వరకు పంట కొనుగోలు జరిగేలా చూడాలని, వరి కొయ్యలను కాల్చకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భూముల 'విలువల' పెంపునకు సర్వం సిద్ధం

-రీజినల్ రింగ్ రోడ్డుకు అనుసంధానమై ఉన్న షాద్‌నగర్ లో పెంపునకు ప్రతిపాదన

-అత్యధిక ప్రాంతాల్లో 25శాతం పెరిగే అవకాశం

-కొన్ని ప్రాంతాల్లో 50-75శాతం వరకు.. అక్కడక్కడా వంద శాతం పెంపు

-కొన్ని చోట్ల ప్రస్తుత విలువల కొనసాగింపు


-ఈ నెల 28 నుంచి అమల్లోకి కొత్త విలువలు

మే 24 ( హంసకలం వార్త )

భూముల మార్కెట్ విలువ పెంపునకు స్టాంపులు,రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు.ఈ నెల 28వ తేదీ నుంచి నూతన మార్కెట్ విలువలు అందుబాటులోకి రానున్నాయి.కోర్ పరిధిలో అపార్ట్‌మెంట్ల నిర్మాణం అధికంగా ఉండటంతో..ఈ ప్రాంతంలో ఫ్లాట్ల ధరల్లో పెద్దగా మార్పు లేకుండా ప్రస్తుత విలువలకు అదనంగా 10 నుంచి 20 శాతం వరకు పెంపును ప్రతిపాదించారు.ఓపెన్ ప్లాట్లు, వ్యవసాయ భూముల విషయంలో 20 శాతం నుంచి 100 శాతం వరకు పెంపు ఉన్నట్లు తెలిసింది. మొత్తమ్మీద 25 శాతం పెంపు ఉన్న ప్రాంతాలు అత్యధికంగా ఉంటాయని,50 నుంచి 75 శాతం పెంపు ఉన్న ప్రాంతాలు ద్వితీయ శ్రేణి క్యాటగిరిలో,100 శాతం పెంపు ఉన్న ప్రాంతాలు తృతీయ క్యాటగిరీలో స్వల్పంగా ఉన్నట్లు సమాచారం.రాష్ట్రవ్యాప్తంగా అసలు పెంపు లేని ప్రాంతాలు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది.అక్కడ ప్రస్తుతం ఉన్న ధరలనే కొనసాగించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

-అదనపు కలెక్టర్ల పర్యవేక్షణలో కసరత్తు

వ్యవసాయ భూముల విషయంలో బహిరంగ మార్కెట్ విలువకు, రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించిన విలువకు మధ్య భారీగా వ్యత్యాసం ఉంది.ఈ నేపథ్యంలో పరిశ్రమలు, ప్రధాన రహదారులను ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న బహిరంగ మార్కెట్ విలువను పరిగణలోకి తీసుకుని,రిజిస్ట్రేషన్ విలువలను నిర్ణయిస్తున్నారు. అయితే దీనిపై ఇంకా పూర్తి స్పష్టత రాలేదు.అదనపు కలెక్టర్ల (రెవెన్యూ)



పర్యవేక్షణలో ఈ కసరత్తు జరుగుతోంది.ఇప్పటికే తహశీల్దార్లు ఆయా మండలాల పరిధిలో భూముల విలువల్లో ఎంత అంతరం ఉందనే సమాచారాన్ని అదనపు కలెక్టర్లకు అందజేశారు.సోమవారం జరిగే సమావేశంలో జిల్లాల స్థాయిలో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది.ఔటర్ రింగు రోడ్డు అవతల ఉన్న ప్రాంతాల్లో వ్యవసాయ భూముల విలువలను వంద శాతం మించి పెంచాలని కొందరు తహశీల్దార్లు ప్రతిపాదించారు.రీజినల్ రింగ్ రోడ్డుకు అను సంధానమై ఉన్న చౌటుప్పల్,యాదాద్రి, షాద్‌నగర్, కడ్తాల్, సదాశివపేట, మహేశ్వరం, తుక్కుగూడ, ఆదిభట్ల, దుండిగల్ తదితర ప్రాంతాల్లో ఈ పెంపును ప్రతి పాదించి నట్లు సమాచారం. భానూరు, పటాన్‌చెరు ప్రాంతాలు పారిశ్రామిక బెల్ట్ నుంచి రెసిడెన్షియల్ బెల్ట్‌గా మారుతున్నాయి.ఈ ప్రాంతాల్లో భూముల విలువలను వాస్తవ పరిస్థితులకు దగ్గరగా పెంచేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది.మోకిల, శంకరపల్లి వంటి ప్రాంతాల్లో విల్లా ప్రాజెక్టులు,గేటెడ్ కమ్యునిటీల అభివృద్ధి ఎక్కువ ఉంది.ఇక్కడ వంద శాతం పెంపునకు అవకాశం ఉంది.మరోవైపు,ఇప్పటికే వ్యవసాయ భూముల విలువలు అధికంగా ఉన్న కొన్ని ప్రాంతాల్లో పాత విలువలను కొనసాగించేలా పెంపు నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు తెలిసింది.ఉదాహరణకు బేగంపేట మండలంలో వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ విలువ ప్రకారమే ఎకరా రూ.30 కోట్లకు పైగా ఉంది. ఇలాంటి చోట్ల 5-10 శాతం లోపు పెంచనున్నట్లు తెలుస్తోంది.

-ధరల నిర్ణయం కమిటీలదే

నాలుగేళ్ల తరువాత భూముల మార్కెట్ విలువలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించగా..పెంపు బాధ్యతలను రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా కమిటీలకు అప్పగించింది.ఆయా జిల్లాల పరిధిలో పూర్తి స్థాయిలో కమిటీలే వాస్తవ పరిస్థితిని బేరీజు వేసుకుని ప్రభుత్వ సూచనల ప్రకారం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.ఇప్పటికే జిల్లా కమిటీలు ఇచ్చిన ప్రతిపాదనలు పరిశీలించిన రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విలువల పెంపుపై కొన్ని సూచనలు చేశారు. సోమవారం నాటికి తుది నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. భూముల విలువ పెంపుపై ప్రాథమిక నివేదికలు సిద్ధం చేశాక..ప్రజల నుంచి,రియల్టర్ల నుంచి వచ్చే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయం తీసుకుంటారు.జిల్లా స్థాయి కమిటీలు సిఫారసు చేసిన ధరలను..రాష్ట్ర స్థాయి కమిటీ పరిశీలించాక ప్రభుత్వం గెజిట్ విడుదల చేస్తుంది.

# రాష్ట్రంలో అన్ని జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం

-తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం

-ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచే నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం

-రెండో విడత ఇందిరమ్మ

-ఇళ్ల మంజూరుకు కూడా కేబినెట్ గ్రీన్ సిగ్నల్!




మే 24 ( హంసకలం వార్త )

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, విద్య, గృహ నిర్మాణం, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలపై కీలక నిర్ణయాలతో రాష్ట్ర మంత్రివర్గం కీలక అడుగులు వేసింది. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచే నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన తాజా కేబినెట్ సమావేశంలో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచే పలు నిర్ణయాలకు ఆమోదం లభించింది. విద్యార్థుల పోషకాహారం నుంచి పేదలకు గృహాలు, పరిశ్రమల పెట్టుబడుల నుంచి విద్యుత్ రంగ అభివృద్ధి వరకు పలు అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి దిశగా ఈ నిర్ణయాలు కీలకంగా మారనున్నాయని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను మంత్రులు వెల్లడించారు. తెలంగాణలో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్రంలోని అన్ని జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న ఆహార కార్యక్రమాలను మరింత విస్తరిస్తూ, జూనియర్ కళాశాల విద్యార్థులను కూడా ఈ పరిధిలోకి తీసుకురానున్నారు. దీనితో పాటు విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించే అంశంపై కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడం, చదువుపై మరింత ఆసక్తి పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా భావిస్తున్నారు. అలాగే డీసీఎంఎస్‌లను మార్క్ ఫెడ్‌లో విలీనం చేయడం, తెలంగాణ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌ను సంబంధిత సంస్థలో విలీనం చేసే అంశాలకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపినట్లు సమాచారం. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన భూసేకరణ, పునరావాసం, మౌలిక వసతుల కల్పన కోసం రూ.587 కోట్ల కేటాయింపుకు కూడా ఆమోదం లభించింది.

-రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కూడా కేబినెట్ గ్రీన్ సిగ్నల్!

ఇక రాష్ట్రంలో గృహ అవసరాలను తీర్చేందుకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కూడా కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు వేల చొప్పున మొత్తం 2.50 లక్షల పేద కుటుంబాలకు ఇళ్ల మంజూరు చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో కొత్త ఇళ్లతో పాటు గతంలో ప్రారంభమై వివిధ దశల్లో నిలిచిపోయిన గృహాలను కూడా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పునాదులు పూర్తై అక్కడే ఆగిపోయిన ఇళ్లకు, గోడల దశలో నిలిచిపోయిన ఇళ్లకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించనున్నారు. గతంలో అసంపూర్తిగా మిగిలిపోయిన గృహ నిర్మాణాలను పూర్తి చేయడం ద్వారా వేలాది కుటుంబాలకు ఊరట కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. అదే సమయంలో రాష్ట్రంలో గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. వివిధ సర్వేల ప్రకారం రాష్ట్రంలో వేలాది కుటుంబాలు ఇంకా తాత్కాలిక నివాసాల్లోనే జీవిస్తున్నట్లు గుర్తించిన ప్రభుత్వం, వారందరికీ త్వరితగతిన గృహాల మంజూరు పత్రాలు అందించాలని నిర్ణయించింది. తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. ఆదివాసీ ప్రాంతాల్లో కూడా ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమాలను వేగవంతం చేయాలని నిర్ణయించారు. హైదరాబాద్ మహానగర ప్రాంతంలో భారీ సంఖ్యలో గృహ దరఖాస్తులు రావడంతో నగర అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అల్పాదాయ వర్గాల కోసం లక్ష ఇళ్ల నిర్మాణం చేపట్టాలని కేబినెట్ నిర్ణయించింది. నిర్మించే గృహాలతో పాటు భూమిపై హక్కులను కూడా లబ్ధిదారుల పేర్లతో నమోదు చేసే విధానాన్ని పరిశీలిస్తున్నారు. భవిష్యత్తులో మధ్యతరగతి వర్గాలకు కూడా ఇలాంటి గృహ నమూనాలను విస్తరించే అంశంపై ప్రభుత్వం దృష్టి సారించింది. విద్యుత్ రంగంలో మౌలిక సదుపాయాల మెరుగుదలకు కేంద్రం అమలు చేస్తున్న పథకంలో చేరేందుకు తెలంగాణ డిస్కంల ప్రతిపాదనలకు కూడా రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. విద్యుత్ పంపిణీ వ్యవస్థను ఆధునీకరించడం, సేవలను మరింత సమర్థవంతంగా మార్చడం ఈ కార్యక్రమం లక్ష్యంగా భావిస్తున్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన మీటర్ల అంశంపై వస్తున్న అనుమానాలకు కూడా ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఈ కార్యక్రమానికి వాటికి ఎలాంటి సంబంధం లేదని పేర్కొంది. అలాగే వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల కోసం మౌలిక వసతులు, అభివృద్ధి పనుల నిమిత్తం భారీ నిధులను కేటాయించేందుకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇక రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కొత్త విధానానికి కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. రాబోయే సంవత్సరాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు లక్షలాది ఉద్యోగ అవకాశాలు సృష్టించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. పరిశోధన, ఆవిష్కరణలు, డిజిటల్ హెల్త్, బయోటెక్నాలజీ వంటి రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. తయారీ రంగంతో పాటు పరిశోధన, అభివృద్ధి రంగాలను కూడా పరిశ్రమలుగా గుర్తిస్తూ కొత్త అవకాశాలకు మార్గం సుగమం చేయనుంది.

# ధాన్యం కొనుగోలులో అగ్రగామిగా నిజామాబాద్ జిల్లా

-జిల్లా యంత్రాంగాన్ని అభినందించిన మంత్రులు, సీ.ఎస్

-రికార్డు స్థాయిలో 6.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ




మే 24 ( హంసకలం వార్త )

వరి ధాన్యం కొనుగోలులో నిజామాబాద్ జిల్లా రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలువడం పట్ల మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు జిల్లా యంత్రాంగాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితరులతో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వరి ధాన్యం సేకరణ, జొన్న, మొక్కజొన్న కొనుగోళ్లపై సమీక్ష జరిపారు. నిజామాబాద్ జిల్లాలో ఇప్పటికే 96శాతం మేర 6.62 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరణ పూర్తి చేయడం పట్ల కలెక్టర్ ఇలా త్రిపాఠితో పాటు సంబంధిత అధికారులను అభినందించారు. వేసవి తీవ్రత, హమాలీల కొరత వంటి అనేక ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పటికీ, లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం కొనుగోళ్ళు జరపడం అభినందనీయం అని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. యాసంగి -- 2026 సీజన్ కు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరపాల్సి ఉండగా, ఇప్పటివరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ళు పూర్తయ్యాయని వివరించారు. ఇందులో ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే సుమారు 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందని గణాంకాలు వెల్లడించారు. ఇతర జిల్లాలలో కూడా ధాన్యం సేకరణను వేగవంతం చేసి, ఈ నెలాఖరు నాటికి అన్ని చోట్లా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. గడిచిన మూడు సీజన్ ల నుండి స్వతంత్ర భారత దేశంలోనే ప్రభుత్వ పరంగా రైతుల నుండి అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ అగ్రభాగాన నిలుస్తోందని గుర్తు చేశారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో యాసంగిలో 8575 కొనుగోలు కేంద్రాలను నెలకొల్పి పెద్ద ఎత్తున ధాన్యం సేకరిస్తున్నామని వివరించారు. సేకరించిన వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి రైతుల ఖాతాలలో రూ.45 వేల కోట్లకు పైగా డబ్బులు జమ చేశామని అన్నారు. ధాన్యం సేకరణ తుది దశకు చేరిన దృష్ట్యా, ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ రైతుల నుండి మిగిలిన ధాన్యం నిల్వలను సైతం వేగంగా కొనుగోళు ళ జరిగేలా కృషి చేయాలని కలెక్టర్లకు సూచించారు. అకాల వర్షాలు కురిసే ప్రమాదం ఉన్నందున కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే రైస్ మిల్లులకు తరలించాలని అన్నారు. ఒకవేళ వర్షాలకు ధాన్యం తడిసినా, దానిని ప్రభుత్వ పరంగా కొనుగోలు చేసి బాయిల్డ్ మిల్లులకు తరలించేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, ఈ మేరకు రైతులకు భరోసా కల్పించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఉంటే, నేరుగా తమ దృష్టికి తేవాలని అన్నారు. తాలు, తరుగు పేరిట ఎక్కడైనా మిల్లర్లు, ట్రేడర్లు రైతులకు నష్టం చేకూర్చేలా వ్యవహరిస్తే, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని అన్నారు. మరో వారం రోజుల పాటు అప్రమత్తంగా వ్యవహరిస్తూ పంట కొనుగోళ్లు సాఫీగా జరిగేలా ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని హితవు పలికారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, వరి పంట కోసిన అనంతరం కొంతమంది రైతులు వరి కోయ్యలకు నిప్పు పెడుతున్నారని, ఇది పర్యావరణానికి హాని కలిగించడంతో పాటు భూసారం దెబ్బతింటుందని, ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఏర్పడుతోందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వరి కోయ్యలకు నిప్పు పెట్టకుండా రైతులకు గ్రామగ్రామాన విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు అనంతరం మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్, చిత్రారామచంద్రన్, దివ్య దేవరాజన్ తదితరులు ఈ నెల 25 నుంచి ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించే మహిళా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి కలెక్టర్లకు, సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రోజువారీగా చేపట్టాల్సి ఉన్న కార్యక్రమాలను తెలియజేస్తూ, మహిళా సంక్షేమ వారోత్సవాలను నిర్దేశిత షెడ్యూల్ మేరకు నిర్వహించి విజయవంతం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, భుజంగరావు, జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్, డీసీఓ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరాస్వామి, మార్కెటింగ్ శాఖ ఏ.డీ గంగుబాయి, డీడబ్ల్యూఓ పద్మ, సీ.పీ.ఓ రతన్, ఎ.పీ.డీ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# పసిబిడ్డతో వెళ్తున్న మహిళపై కామాంధుడి వికృత చేష్టలు

-పోలీసులు కామాంధుడికి తమదైన శైలిలో ట్రీట్‌మెంట్

-ఇంకొకడు ఇలాంటి పని చేయాలంటే వణుకు పుట్టేలా!

-నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణమైన సంఘటన



మే 24 ( హంసకలం వార్త )

ఆడపిల్ల బయట అడుగు పెట్టాలంటేనే భయపడే పరిస్థితులు మళ్లీ ముంచుకొస్తున్నాయి. అర్ధరాత్రి కాదు కదా కనీసం పసిబిడ్డతో పట్టపగలు రోడ్డుపై నడిచి వెళ్లేందుకు సైతం స్వేచ్ఛ లేని దుస్థితి ఎదురవుతోంది

-నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణమైన సంఘటన


హైదరాబాద్ నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసిన ఒక దారుణమైన సంఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఒక మహిళ పట్ల అత్యంత హేయంగా ప్రవర్తించిన ఒక కీచకుడిని పోలీసులు ఎట్టకేలకు కటకటాల వెనక్కి నెట్టారు.

-అసలు ఏం జరిగింది?

నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్కాపూర్ టౌన్‌షిప్ రోడ్ నంబర్ 4 లో ఒక మహిళ తన రెండున్నరేళ్ల పసిబిడ్డను తీసుకుని నడుచుకుంటూ వెళ్తోంది. అప్పటికే ఆమెను వెంబడిస్తున్న ఒక కామాంధుడు, ఎవరూ లేని సమయం చూసి వెనుక నుంచి ఒక్కసారిగా నడిరోడ్డుపైనే అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆమె దుస్తులను పైకెత్తి వికృత ఆనందం పొందాడు. ఒక్కసారిగా జరిగిన ఈ ఘోరానికి ఆ మహిళ షాక్‌కు గురవ్వగా ఆ కీచకుడు అక్కడి నుంచి పారిపోయాడు. ఈ అనాగరిక చర్య మొత్తం అక్కడ ఉన్న సీసీటీవీ కెమెరాలో స్పష్టంగా రికార్డయ్యింది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో బయటకు రావడంతో ఒక్కసారిగా తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనంగా మారాయి. పట్టపగలే ఇంత తెగింపా? ఇలాంటి మృగాళ్లను నడిరోడ్డుపై ఉరితీయాలి అంటూ నెటిజన్లు, మహిళా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇలాంటి పనులు చేయాలంటేనే మగాళ్లకు చెమటలు పట్టేలా కఠినమైన శిక్షలు వేయాలని డిమాండ్లు వెల్లువెత్తాయి. ఈ ఘటనను సైబరాబాద్ పోలీస్ యంత్రాంగం అత్యంత తీవ్రంగా పరిగణించింది. ఈ వీడియో నార్సింగి పోలీసుల దృష్టికి వెళ్లడంతో మే 19న కేసు నమోదు చేశారు. బృందాలుగా ఏర్పడి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని పట్టుకునేందుకు నార్సింగి పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. కొన్ని రోజుల్లోనే సాంకేతిక పరిజ్ఞానం సాయంతో నిందితుడి ఆచూకీ కనిపెట్టి సంకెళ్లు వేశారు. పోలీసుల విచారణలో నిందితుడిని పుప్పాలగూడకు చెందిన వడ్డే నాగరాజు (26) గా గుర్తించారు. ఇక పోలీసులు ఈ కామాంధుడికి తమదైన శైలిలో ట్రీట్‌మెంట్ ఇచ్చారు. ఇంకో వ్యక్తి ఇలాంటి ఘటనలు చేయాలంటే వణుకు పుట్టేలా చేశారు. ప్రస్తుతం అతడిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. చట్టాలు ఎన్ని ఉన్నా, పోలీసులు ఎంత నిఘా పెడుతున్నా ఇలాంటి వికృత చేష్టలకు పాల్పడే మృగాళ్ల సంఖ్య తగ్గడం లేదు. కానీ, ఈ కేసులో పోలీసులు స్పందించిన తీరు, నిందితుడిని పట్టుకున్న వేగం ప్రశంసనీయం.

# తెలంగాణలో మారుతున్న వాతావరణం

-మూడు రోజుల పాటు వర్షాలు,ఈదురుగాలులు



మే 24 ( హంసకలం వార్త )

తెలంగాణ రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు క్రమంగా మారుతున్నాయి. ఒకవైపు ఎండలు కొనసాగుతుండగా..మరోవైపు నైరుతి రుతుపవనాలు చురుకుగా ముందుకు సాగుతున్నాయి.దీంతో రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వర్షాలు,ఉరుములు,ఈదురుగాలులు నమో దయ్యే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం..నైరుతి రుతుపవనాలు ఆగ్నేయ అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు, కొమరిన్ ప్రాంతం, నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతం,అండమాన్ సముద్రంలోని మిగిలిన ప్రాంతాలు, తూర్పు-మధ్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాల వైపు మరింత ముందుకు సాగే పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి.ఇక మరోవైపు దక్షిణ బీహార్ పరిసర ప్రాంతాల నుంచి జార్ఖండ్,ఒడిశా మీదుగా ఉత్తర కోస్తా ఆంధ్ర తీరం వరకు ఉత్తర-దక్షిణ ద్రోణి కొనసాగుతోంది.ఇది సగటు సముద్ర మట్టానికి సుమారు 1.5 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అధికారులు తెలిపారు.ఈ ప్రభావంతో తెలంగాణలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు.

-మూడు రోజుల వాతావరణ సూచన

ఆదివారం,సోమవారం,మంగళవారం రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.ముఖ్యంగా సాయంత్రం మరియు రాత్రి వేళల్లో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపింది.అదే సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.వర్షాల ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో తాత్కాలికంగా ఉష్ణోగ్రతలు తగ్గినా.. రాష్ట్రవ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు మాత్రం ఇంచుమించు ప్రస్తుత స్థాయిలోనే కొనసాగే అవకాశముందని పేర్కొంది.

-కొన్ని జిల్లాలకు వడగాల్పుల హెచ్చరిక

వర్షాల సూచనలు ఉన్నప్పటికీ.. రాష్ట్రంలోని కొన్ని ఉత్తర,తూర్పు జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.ఉరుములు,మెరుపుల సమయంలో ప్రజలు చెట్ల కింద నిలబడకూడదు.ఈదురుగాలుల సమయంలో అవసరం లేకపోతే బయటకు వెళ్లకుండా ఉండాలి. మధ్యాహ్నం వేళల్లో అధిక ఎండలో ఎక్కువసేపు తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.తగినంత నీరు తాగుతూ శరీరాన్ని చల్లగా ఉంచుకోవాలి.రాబోయే రోజుల్లో నైరుతి రుతుపవనాల పురోగతితో తెలంగాణలో వర్షాల తీవ్రత మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ నిపుణులు భావిస్తున్నారు.

హంస కలం వార్త



# బిజినెస్

## నిలకడగా బంగారం, వెండి ధరలు.. ప్రధాన నగరాల్లో రేట్లు ఇలా!

- కొన్ని రోజులుగా పెరుగుతున్న బంగారం ధరలకు బ్రేక్
- నిలకడగా ఉన్న ధరలతో కొనుగోలుదారులకు స్వల్ప ఊరట
- హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,060
- వెండి ధరల్లో కూడా మార్పులు లేవు



గత కొన్ని రోజులుగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతున్నాయి. దీంతో పసిడి కొనుగోలు చేయాలనుకునే వారికి కాస్త ఊరట లభించినట్లయింది. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ అనిశ్చితి కారణంగా బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. ఆదివారం కూడా బంగారం, వెండి ధరలు నిలకడగా ఉన్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ఆదివారం ఉదయం నాటికి హైదరాబాద్, విజయవాడ మార్కెట్లలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,060 వద్ద స్థిరంగా ఉంది. అదేవిధంగా, 22 క్యారెట్ల ఆభరణాల బంగారం 10 గ్రాముల ధర రూ.1,45,800గా కొనసాగుతోంది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,59,210 గా, 22 క్యారెట్ల ధర రూ.1,45,950గా నమోదైంది.మరోవైపు వెండి ధరల్లో కూడా ఎటువంటి మార్పు కనిపించలేదు. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విజయవాడ నగరాల్లో కిలో వెండి ధర రూ.2,95,000 వద్ద నిలకడగా ఉంది. ఢిల్లీ, బెంగళూరులో కిలో వెండి ధర రూ.2,85,000 ఉండగా, చెన్నైలో రూ.2,95,000గా కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలోని పరిణామాలను బట్టి భవిష్యత్తులో ఈ ధరలు మారే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# భారత్‌లో హోండా కొత్త కారు... లుక్ ఎలా ఉందో చూశారా



భారత ఆటోమొబైల్ మార్కెట్‌లో ప్రీమియం ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో పోటీని మరింత పెంచుతూ హోండా కార్స్ ఇండియా తన కొత్త ఫ్లాగ్‌షిప్ ఎస్‌యూవీ 'హోండా జడ్ఆర్-వీ హైబ్రిడ్'ను అధికారికంగా విడుదల చేసింది. అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ మోడల్‌ను జపాన్ నుంచి కంప్లీట్లీ బిల్ట్ యూనిట్ (సీబీయూ) రూపంలో దిగుమతి చేసి విక్రయించనున్నారు. అత్యాధునిక ఫీచర్లు, శక్తివంతమైన హైబ్రిడ్ ఇంజిన్‌తో ఇది వినియోగదారులను ఆకట్టుకోనుంది.

### డిజైన్.. కొలతలు

చూడగానే ఆకట్టుకునే స్టైలిష్ డిజైన్‌తో ఈ కారు రూపుదిద్దుకుంది. దీని స్లిక్ ఎస్‌యూవీ సిల్హౌట్, ఫ్లోయింగ్ బాడీ లైన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ముందు భాగంలో గ్లాసీ బ్లాక్ వర్టికల్ స్లాట్ గ్రిల్, స్లిమ్ ఫుల్-ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్, సీక్వెన్షియల్ టర్న్ ఇండికేటర్లు దీనికి ప్రీమియం లుక్‌ను అందిస్తున్నాయి. వెనుక భాగంలో ఎల్ఈడీ టైల్ ల్యాంప్స్, డ్యూయల్ ఎగ్జాస్ట్ ఫినిషర్, 18-అంగుళాల డైమండ్-కట్ అల్లాయ్ వీల్స్ స్పోర్టీనెస్ జోడిస్తాయి. ఈ ఎస్‌యూవీ 4,567 ఎంఎం పొడవు, 1,840 ఎంఎం వెడల్పు, 1,621 ఎంఎం ఎత్తు, 2,655 ఎంఎం వీల్‌బేస్‌తో విశాలంగా ఉంది.

### ఇంటీరియర్.. ఫీచర్లు

కేవలం బయటికే కాదు, కారు లోపల కూడా హోండా ప్రీమియం అనుభూతిని అందించింది. స్పోర్టీ ఆల్-బ్లాక్ థీమ్‌తో కూడిన ఇంటీరియర్‌లో సాఫ్ట్-టచ్ మెటీరియల్స్ వాడారు. డ్యూయల్ స్క్రీన్ లేఅవుట్ ప్రధాన ఆకర్షణగా ఉంది. ఇందులో 9-అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ (వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో ఑ ఆపిల్ కార్‌ప్లే), 10.25-అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ ఉన్నాయి. పానరమిక్ సన్‌రూఫ్, డ్యూయల్-జోన్ క్లైమేట్ కంట్రోల్, వైర్‌లెస్ ఫోన్ ఛార్జింగ్, 12-స్పీకర్ల బోస్ ఆడియో సిస్టమ్, పవర్డ్ ఫ్రంట్ సీట్లు, పవర్డ్ టెయిల్‌గేట్ వంటి ఫీచర్లు ప్రయాణ అనుభూతిని మెరుగుపరుస్తాయి. వెనుక సీట్లను మడిస్తే 1,313 లీటర్ల భారీ లగేజ్ స్పేస్ అందుబాటులో ఉంటుంది.

### ఇంజిన్.. భద్రత

ఈ ఎస్‌యూవీకి గుండె వంటిది దీని 2.0-లీటర్ ఇ:హెచ్ఈవీ స్ట్రాంగ్ హైబ్రిడ్ సిస్టమ్. 2.0లీటర్ల అట్కిన్‌సన్-సైకిల్ పెట్రోల్ ఇంజిన్, డ్యూయల్ మోటార్ హైబ్రిడ్ సిస్టమ్ కలిసి 184 బీ హెచ్ పీ పవర్, 315 ఎన్ఎమ్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తాయి. ఇది లీటరుకు 22.79 కిలోమీటర్ల మైలేజీని అందిస్తుందని హోండా పేర్కొంది. ఎలక్ట్రిక్, హైబ్రిడ్, ఇంజిన్ మోడ్‌ల మధ్య ఇది ఆటోమేటిక్‌గా మారుతుంది. భద్రత విషయంలో హోండా అత్యున్నత ప్రమాణాలు పాటించింది. ఇందులో భాగంగా హోండా సెన్సింగ్ సూట్‌ను అందించింది. కొలిషన్ మిటిగేషన్ బ్రేకింగ్ సిస్టమ్, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్, లేన్ కీపింగ్ అసిస్ట్ వంటి ఫీచర్లతో పాటు 8 ఎయిర్‌బ్యాగులు, 360ీ కెమెరా, హిల్ డీసెంట్ కంట్రోల్ వంటివి ఉన్నాయి.

### బుకింగ్స్.. వారంటీ


హోండా జడ్ఆర్-వీ హైబ్రిడ్ కోసం బుకింగ్స్ ఇప్పటికే ప్రారంభమయ్యాయి. జూలై నుంచి డెలివరీలు మొదలవుతాయి. ఈ కారుపై 3 సంవత్సరాల అన్‌లిమిటెడ్ కిలోమీటర్ల వారంటీ, బ్యాటరీ పై 8 ఏళ్లు లేదా 1,60,000 కి.మీ వారంటీని కంపెనీ అందిస్తోంది. ప్లాటినం వైట్ పెరల్, క్రిస్టల్ బ్లాక్ పెరల్ సహా పలు ఆకర్షణీయమైన రంగుల్లో ఇది లభ్యం కానుంది.

# వెల్‌డన్ అర్జున్.. ఆ రెండింటినీ గెలిచావు.. నిన్ను చూస్తే గర్వంగా ఉంది: కుమారుడి పై సచిన్ భావోద్వేగ పోస్ట్



క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తన కుమారుడు అర్జున్ టెండూల్కర్ ఐపీఎల్ అరంగేట్రంపై సోషల్ మీడియాలో భావోద్వేగ పోస్ట్ చేశాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) తరఫున అర్జున్ నిన్న తన తొలి మ్యాచ్ ఆడాడు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో లక్నో ఓడిపోయినప్పటికీ, అర్జున్ తన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో సచిన్ తన కుమారుడిని ప్రశంసిస్తూ చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. లక్నో జట్టు ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించడంతో తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో అర్జున్‌కు అవకాశం ఇచ్చింది. ఈ మ్యాచ్‌లో బౌలింగ్‌తో ఆకట్టుకున్న 26 ఏళ్ల అర్జున్, పంజాబ్ ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్‌ను ఒక అద్భుతమైన యార్కర్‌తో ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. మొత్తం నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసి 36 పరుగులిచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. నిజానికి తన తొలి ఓవర్లోనే ప్రభ్‌సిమ్రాన్ వికెట్ తీసేవాడే కానీ, రిషభ్ పంత్ క్యాచ్ వదిలేయడంతో ఆ అవకాశం చేజారింది. జట్టులోని మిగతా బౌలర్లతో పోలిస్తే 9 ఎకానమీ రేటుతో మెరుగైన ప్రదర్శన కనబరిచాడు. బ్యాటింగ్‌లో ఐదు బంతులు ఎదుర్కొని 5 పరుగులు చేశాడు. ఈ సీజన్‌లో అర్జున్‌కు ఎక్కువ అవకాశాలు రాకపోయినా, ఓపికగా, సానుకూలంగా ఉన్న తీరుపట్ల తనకు గర్వకారణంగా ఉందని సచిన్ తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. "అర్జున్.. చాలా బాగా ఆడావు. ఈ సీజన్ మొత్తం నీ సామర్థ్యాన్ని నమ్ముతూ, ఓపికతో ఉంటూ, నిశ్శబ్దంగా కష్టపడిన తీరు చూసి గర్వపడుతున్నాను. చివరి మ్యాచ్ వరకు అవకాశం కోసం ఎదురుచూసినా నువ్వు సానుకూలంగా ఉన్నావు. క్రికెట్ అనేది నైపుణ్యంతో పాటు ఓపికను కూడా పరీక్షిస్తుంది. ఈ రోజు నువ్వు ఆ రెండింటినీ అద్భుతంగా ప్రదర్శించావు. ఎప్పుడూ ఇలాగే ఉండు. ఆటను ప్రేమించడం కొనసాగించు. లవ్ యూ ఆల్వేస్" అంటూ సచిన్ తన ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చాడు. ఐపీఎల్ 2026 సీజన్ అర్జున్‌కు చాలా కీలకం. ముంబై ఇండియన్స్ కాకుండా మరో ఫ్రాంచైజీ తరఫున అతను ఆడుతున్న తొలి సీజన్ ఇదే. ఈ ఏడాది వేలానికి ముందు ముంబై నుంచి ట్రేడింగ్ ద్వారా అర్జున్ లక్నో జట్టుకు మారిన విషయం తెలిసిందే.

# ఐపీఎల్ మ్యాచ్‌లో రచ్చ.. చీర్ లీడర్లతో అభిమానుల అసభ్య ప్రవర్తన..



లక్నోలోని ఏకనా క్రికెట్ స్టేడియంలో ఐపీఎల్ 2026 మ్యాచ్ సందర్భంగా ఓ వివాదం చోటుచేసుకుంది. పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య శనివారం జరిగిన మ్యాచ్‌లో కొందరు అభిమానులు చీర్ లీడర్లతో అసభ్యంగా ప్రవర్తించారు. ఈ ఘటనతో స్టేడియంలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. మ్యాచ్ జరుగుతుండగా, కొంతమంది ప్రేక్షకులు చీర్ లీడర్లను ఇబ్బంది పెట్టడం మొదలుపెట్టారు. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అసభ్యంగా ప్రవర్తించిన అభిమానుల గుంపు పై చర్యలు తీసుకున్నారు. అక్కడి నుంచి వచ్చిన దృశ్యాల ప్రకారం, ఓ మహిళా పోలీస్ అధికారి కూడా అభిమానులతో మాట్లాడి వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. శ్రేయాస్ అయ్యర్ అద్భుత శతకంతో చెలరేగడంతో లక్నో సూపర్ జెయింట్స్‌పై పంజాబ్ కింగ్స్ ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో పంజాబ్ ప్లేఆఫ్స్ ఆశలు మరింత మెరుగయ్యాయి. మరోవైపు, ఈ సీజన్‌లో లక్నోకు ఇది 10వ ఓటమి కావడం గమనార్హం. మ్యాచ్ అనంతరం లక్నో కెప్టెన్ రిషభ్ పంత్ మాట్లాడుతూ, ఈ సీజన్ తమ జట్టుకు ఎంతో సవాలుగా నిలిచిందని అంగీకరించారు.

# స్పోర్ట్స్

## మనకూ ఓ 'బోల్ట్' వచ్చాడు... జాతీయ పోటీల్లో చిరుతలా పరుగెత్తిన సర్దార్జీ!



భారత అథ్లెటిక్స్‌లో ఓ కొత్త సంచలనం నమోదైంది. పరుగు పందెంలో మనకు ఓ ఉసేన్ బోల్ట్ దొరికేశాడంటూ క్రీడాభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. రాంచీ వేదికగా జరుగుతున్న 2026 అథ్లెటిక్స్ ఫెడరేషన్ కప్‌లో పంజాబ్‌కు చెందిన 25 ఏళ్ల గురిందర్‌వీర్ సింగ్ చిరుతలా పరుగెత్తాడు. పురుషుల 100 మీటర్ల ఫైనల్‌లో కేవలం 10.09 సెకన్లలోనే గమ్యాన్ని చేరి స్వర్ణ పతకాన్ని ముద్దాడటమే కాకుండా, సరికొత్త జాతీయ రికార్డును నెలకొల్పాడు. ఈ అద్భుత ప్రదర్శనతో గురిందర్‌వీర్ సింగ్ భారత అథ్లెటిక్స్ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించాడు. 10.10 సెకన్ల కంటే తక్కువ సమయంలో 100 మీటర్ల దూరాన్ని పూర్తి చేసిన మొట్టమొదటి భారత అథ్లెట్‌గా నిలిచాడు. రిలయన్స్ ఫౌండేషన్ తరఫున బరిలోకి దిగిన గురిందర్ వీర్, పాత జాతీయ రికార్డును బద్దలు కొట్టి ఈ చారిత్రక విజయాన్ని అందుకున్నాడు. ఈ అద్భుతమైన టైమింగ్‌తో గురిందర్‌వీర్ 2026 కామన్వెల్త్ గేమ్స్‌కు కూడా అర్హత సాధించాడు. క్రీడల అర్హత మార్క్ 10.16 సెకన్లు కాగా, దాన్ని సునాయాసంగా అధిగమించాడు. ఇదే ఈవెంట్‌లో అనిమేష్ కుజూర్ (10.20 సెకన్లు) రజతం గెలుచుకోగా, ప్రణవ్ గురవ్ (10.29 సెకన్లు) కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. గురిందర్‌వీర్ విజయం భారత స్ప్రింటింగ్‌లో ఒక చారిత్రక మైలురాయిగా నిలిచిపోనుంది.

# ‘పెద్ది’ ఈవెంట్‌లో జాన్వీ కపూర్ మెరుపులు..

# రాయల్ లుక్‌లో అదరగొట్టిన బ్యూటీ

- ‘పెద్ది’ సినిమా మ్యూజిక్ లాంఛ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన జాన్వీ కపూర్
- ప్రముఖ డిజైనర్ అనామికా ఖన్నా రూపొందించిన డీప్ పర్పుల్ లెహెంగాలో మెరుపులు
- సంప్రదాయ ఆభరణాలతో ఆధునిక యువరాణిలా కనిపించిన బ్యూటీ
- పెళ్లిళ్ల సీజన్‌లో వధువులకు సరికొత్త ఫ్యాషన్ ఐకాన్‌గా మారిన జాన్వీ స్టైల్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం ‘పెద్ది’ ప్రమోషన్లు వేగం పుంజుకున్నాయి. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో శనివారం రాత్రి ఈ చిత్ర మ్యూజిక్ లాంఛ్ ఈవెంట్‌ను చిత్రబృందం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హీరో రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానాతో పాటు హాజరైన కథానాయిక జాన్వీ కపూర్, తన అద్భుతమైన ఫ్యాషన్‌తో అందరి దృష్టిని ఆకర్షించారు. ముఖ్యంగా ఆమె ధరించిన లెహెంగా, ఈ సీజన్‌లో పెళ్లి చేసుకోబోయే వధువులకు ఒక అద్భుతమైన ఎంపికగా నిలుస్తుందని ఫ్యాషన్ వర్గాలు ప్రశంసిస్తున్నాయి. ఈ వేడుక కోసం జాన్వీ కపూర్, ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ అనామికా ఖన్నా రూపొందించిన ముదురు వంగ పువ్వు రంగు (డీప్ పర్పుల్) లెహెంగా సెట్‌లో రాజకుమారిలా మెరిసిపోయారు. స్టైలిస్ట్ మేగన్ కాన్సెసియో పర్యవేక్షణలో, సంప్రదాయ భారతీయ హస్తకళను ఆధునిక డిజైన్‌తో మిళితం చేసి, ఒక ‘ఆధునిక భారతీయ యువరాణి’ రూపాన్ని ఆవిష్కరించారు. ఈ లెహెంగా సెట్‌లోని క్రాప్డ్ బ్లౌజ్ జాన్వీ అందాన్ని మరింత పెంచింది. రౌండ్ నెక్‌లైన్, హాఫ్ స్లీవ్స్‌తో ఉన్న ఈ బ్లౌజ్‌పై సున్నితమైన సీక్విన్‌లు, క్లిష్టమైన జరీ ఎంబ్రాయిడరీ, చిన్న తెల్లని పూసలతో చేసిన అలంకరణ అద్భుతంగా ఉంది. ఈ డిజైన్ ఆమె మిడ్‌రిఫ్‌ను హైలైట్ చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీనికి జతగా, అదే రంగులో ఉన్న హై-వెయిస్టెడ్ ఏ-లైన్ లెహెంగా స్కర్ట్‌పై సంప్రదాయ గోల్డ్ జరీ వర్క్ చూపరులను కట్టిపడేసింది. ఇక, ఒక భుజంపై పిన్ చేసి, నడుము వద్దకు అందంగా చుట్టిన పల్చటి షిఫాన్ దుపట్టా ఆమె లుక్‌కు సంపూర్ణతను తెచ్చిపెట్టింది. కేవలం దుస్తులే కాదు, ఆమె ధరించిన ఆభరణాలు కూడా ప్రత్యేకంగా నిలిచాయి. ‘మహేష్ నోతన్‌దాస్’ జ్యువెలరీ నుంచి ఎంచుకున్న భారీ గోల్డ్ నెక్ పీస్, దానికి వేలాడుతున్న ముత్యాలు రాయల్ లుక్‌ను ఇచ్చాయి. బ్లౌజ్‌పై పొరలుగా అమర్చిన ముత్యాల బ్రూచ్‌లు, చెవులకు అలంకరించిన భారీ జుంకాలు, వాటికి అనుసంధానంగా ఉన్న కణ్ ఫూల్ (ఇయర్ కఫ్), చేతులకు ధరించిన హథ్ ఫూల్ (హ్యాండ్ హార్నెస్), భారీ స్టేట్‌మెంట్ రింగ్... ఇలా ప్రతి ఆభరణం ఆమెను ఒక ఆధునిక యువరాణిలా మార్చేసింది. సౌరవ్ రాయ్, విధి పెరీరా తీర్చిదిద్దిన సంప్రదాయ జడ, మధ్యలో పాపిడితో నీట్‌గా కనిపించింది. ఇక మేకప్ విషయానికొస్తే, గోల్డ్ షిమ్మరింగ్ ఐషాడో, స్మడ్జ్ బ్లాక్ ఐలైనర్, నుదుట చిన్న వంగ పువ్వు రంగు బొట్టుతో ఆమె ముఖం ప్రకాశవంతంగా కనిపించింది. మొత్తం మీద, గ్లామర్‌తో కూడిన ఈ సంప్రదాయ లుక్‌లో జాన్వీ కపూర్ పెళ్లిళ్ల సీజన్‌లో జరిగే వేడుకలకు సరికొత్త ఫ్యాషన్ ఐకాన్‌గా నిలిచారు. కాగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న ‘పెద్ది’ చిత్రానికి ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

### కూతురితో కలిసి ఆ సినిమా చూస్తే కన్నీళ్లు ఆపుకోవడం చాలా కష్టం:

## ప్రియాంకా చోప్రా భర్త నిక్ జోనస్



ప్రముఖ పాప్ సింగర్, నటి ప్రియాంకా చోప్రా భర్త నిక్ జోనస్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. ఒకానొక డిస్నీ సినిమా చూస్తున్నప్పుడు తాను తీవ్రమైన భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకుంటానని ఆయన వెల్లడించారు. మరీ ముఖ్యంగా తన నాలుగేళ్ల కుమార్తె మాలతితో కలిసి ఆ సినిమా చూస్తున్నప్పుడు ఈ అనుభూతి మరింత ప్రత్యేకంగా ఉంటుందని తెలిపారు. ఇటీవల న్యూయార్క్‌లో తన కొత్త చిత్రం ‘పవర్ బల్లాడ్’ ప్రమోషన్ల కోసం నిర్వహించిన ఒక ప్యానెల్ డిస్కషన్‌లో నిక్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సహనటుడు పాల్ రడ్, దర్శకుడు జాన్ కార్నీ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా హోస్ట్ అడిగిన ఒక ప్రశ్నకు నిక్ సమాధానమిస్తూ.. “నన్ను భావోద్వేగానికి గురిచేసే సినిమా ఏదైనా ఉందా అంటే అది ‘ది లయన్ కింగ్’. ఈ రోజుల్లో ఆ సినిమాను నా కూతురితో కలిసి చూస్తున్నాను. చిన్నప్పుడు నా వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దిన కథలను ఇప్పుడు తనతో పంచుకోవడం చాలా ప్రత్యేకమైన అనుభూతినిస్తోంది” అని అన్నారు. ‘పీపుల్’ మ్యాగజైన్ ఈ వివరాలను తన కథనంలో ప్రచురించింది. అంతేకాకుండా తాను నటించిన ‘పవర్ బల్లాడ్’ చిత్రంలో తండ్రీకూతుళ్ల మధ్య ఉండే కొన్ని సన్నివేశాలు కూడా తనను బాగా కదిలించాయని నిక్ తెలిపారు. విమానాల్లో ప్రయాణిస్తున్నప్పుడు సినిమాలు చూస్తూ కూడా తరచుగా ఏడుస్తానని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. నిక్ జోనస్, ప్రియాంక చోప్రా దంపతులకు 2022లో కుమార్తె మాలతి జన్మించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే.. ఇటీవల ప్రియాంక చోప్రా కూడా ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ తమ కుమార్తె పెంపకం గురించి కొన్ని విషయాలు పంచుకున్నారు. “మాలతి ఎదుగుతున్న కొద్దీ, తనకంటూ కొంత ప్రైవసీ ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. వీలైనంత వరకు తనకంటూ ఒక సాధారణ జీవితాన్ని అందించాలనుకుంటున్నాం. అదే సమయంలో ప్రజలు తన గురించి ఆసక్తిగా ఉంటారనే విషయం కూడా తనకు తెలియాలి. కానీ, దానివల్ల ఆమె భయపడకూడదు. తనకు ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉండాలి” అని ప్రియాంక వివరించారు. ఈ సెలబ్రిటీ జంట తమ కుమార్తెకు మంచి పెంపకాన్ని అందిస్తూ, వ్యక్తిగత, వృత్తిగత జీవితాలను సమన్వయం చేసుకుంటున్న తీరు పలువురిని ఆకట్టుకుంటోంది.

## రామ్ చరణ్ మాస్ స్టెప్పులు కేక..

## వచ్చేసిన ‘హల్లల్లల్లో’ వీడియో సాంగ్!

- ‘పెద్ది’ మూవీ నుంచి ఐటెం సాంగ్ ‘హల్లల్లల్లో’ విడుదల
- సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారిన ఫుల్ వీడియో సాంగ్
- రామ్ చరణ్ స్టెప్పులు, రస్టిక్ లుక్‌కు ఫ్యాన్స్ ఫిదా
- ఆకట్టుకుంటున్న రామ్ చరణ్, జాన్వీ కపూర్ కెమిస్ట్రీ




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న ‘పెద్ది’ సినిమా నుంచి ఐటెం సాంగ్ విడుదలై సోషల్ మీడియాను ఓ ఊపు ఊపేస్తోంది. ‘హల్లల్లల్లో’ అంటూ సాగే ఈ పాట పూర్తి వీడియోను చిత్ర బృందం తాజాగా విడుదల చేసింది. గత రెండు రోజులుగా ప్రోమోతోనే అంచనాలు పెంచిన ఈ పాట, ఇప్పుడు ఫుల్ వీడియోతో అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. విడుదలైన కొద్దిసేపటికే ఈ పాట యూట్యూబ్‌తో పాటు ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ట్రెండింగ్‌లోకి దూసుకెళ్లింది. “హల్లల్లల్లో... బావ చీర చౌక్కా చిక్కడిపోవాలో...” అంటూ అనంత్ శ్రీరామ్ అందించిన సాహిత్యం యువతను ఆకట్టుకుంటోంది. గాయని రక్షిత సురేష్ తన గాత్రంతో పాటకు ప్రత్యేకమైన ఫీల్ తీసుకురాగా, జానీ మాస్టర్ కొరియోగ్రఫీ మరోసారి మ్యాజిక్ చేసింది. ఈ పాటలో రామ్ చరణ్ తనదైన స్టైలిష్ మాస్ స్టెప్పులు, రా అండ్ రస్టిక్ లుక్‌తో అదరగొట్టారు. ముఖ్యంగా రామ్ చరణ్, జాన్వీ కపూర్ మధ్య కెమిస్ట్రీ పాటకు ప్రధాన బలంగా నిలిచింది. నిన్న రాత్రి భోపాల్‌లో జరిగిన ‘పెద్ది కీ ఆవాజ్’ ఈవెంట్‌లో ఈ పాట ఆడియో వెర్షన్‌ను మాత్రమే విడుదల చేశారు. అప్పటి నుంచి పూర్తి వీడియో కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్న అభిమానులకు ఈ విడుదల ఓ సర్‌ప్రైజ్‌గా మారింది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, రెండు పాటలతో సినిమాపై భారీ అంచనాలు నెలకొనగా, ‘హల్లల్లల్లో’ పాట ఆ అంచనాలను మరింత పెంచింది.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037, Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449